వర్షాలతో పంటనష్టం వాటిల్లకుండా జాగ్రత్తలు పాటించాలి

● జిల్లా అధికారులతో మంత్రి వీడియో కాన్ఫరెన్స్


సిరిసిల్ల కలెక్టరేట్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : తుఫాన్ కారణంగా కురిసే అకాల వర్షాలతో రైతుల పంటలు నష్టం వాటిల్లకుండా జాగ్రత్తలు పాటించాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అదేశించారు. సిరిసిల్ల జిల్లా సమీకృత కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన వీడియోకాన్ఫరెన్స్‌లో హైదరాబాద్ నుంచి రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుతో కలసి రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ గరిమా అగర్వాల్‌తో పంటల నష్టంపై సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ రాబోయే రెండు రోజులల్లో తుఫాన్ ప్రభావంతో అకాల వర్షాలు కురిసే అవకాశం ఉందని అన్నారు. జిల్లాలో వరి, పత్తి, మొక్కజొన్న పంట కొనుగోలు కేంద్రాల వద్ద వర్షాల కారణంగా ఎటువంటి నష్టం వాటిల్లకుండా జాగ్రత్తలు పాటిస్తూ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నిర్ధేశించుకున్న ప్రణాళిక ప్రకారం వంద శాతం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఓపెన్ చేయాలని అదేశించారు. పంటల కొనుగోలు ప్రక్రియలో ఎదురయ్యే సమస్యలు, వాస్తవ పరిస్థితులను ఎప్పటికప్పుడు సివిల్ సప్లయ్ కమిషనర్ దృష్టికి తీసుకుని రావాలని సూచించారు. పంటల కొనుగోలు విషయంలో చిన్న తప్పు, అక్రమాలకు కూడా అస్కారం లేదని ఎవరైనా సరే కఠిన చర్యలు తీసుకోవాలని మంత్రి అదేశించారు. మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ తుఫాన్ ప్రభావంతో రాబోయే రెండు రోజుల్లో అకాల వర్షాలు కురిసే ప్రభావం ఉన్నందున పంటలను జాగ్రత్తగా కాపాడాలని అలాగే కోతలు వాయిదా వేసే చర్యలు తీసుకోవాలన్నారు.

అధికారులు అందుబాటులో ఉండాలి

రైతులకు ఆయా శాఖల అధికారులు అందుబాటులో ఉండాలని, పంట ఉత్పత్తులు వర్షానికి తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ గరిమా అగర్వాల్ సూచించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శేషాద్రి, జిల్లా రవాణాశాఖ అధికారి లక్ష్మన్, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి చంద్రప్రకాష్, డీఏవో అఫ్జల్ బేగం, డీసీవో రామకృష్ణ, మార్కెటింగ్ అధికారి ప్రకాష్ అధికారులు పాల్గొన్నారు.

నేడు మెగా రక్తదాన శిబిరం

సిరిసిల్ల క్రైం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా సిరిసిల్ల పట్టణంలోని కళ్యాణలక్ష్మి గార్డెన్‌లో మంగళవారం మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్లు టౌన్ సీఐ కృష్ణ తెలిపారు. ఈ మెగా రక్తదాన శిబిరంలో యువత పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. పోలీస్ అమరవీరుల త్యాగాలకు నివాళిగా రక్తదానం ద్వారా ప్రాణదానం చేయడం ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించాలని ఆయన కోరారు.



పర్యాటకంపై పట్టింపేదీ?

● కదలని ఆధునిక బోటు

● గత ప్రభుత్వ హయాంలో హడావుడిగా ప్రారంభం

● మిడ్‌మానేరు, అనంతగిరి ప్రాజెక్టుల వద్ద ప్రతిపాదనలు

● సిరిసిల్ల మిడ్ మానేరు వద్ద జల విహారానికి ఎదురుచూపులు

సిరిసిల్ల, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణలో గోదావరి జలాల ఎత్తిపోతలకు గుండెకాయగా ఉన్న రాజన్న సిరిసిల్ల జిల్లాలోని శ్రీ రాజరాజేశ్వర మిడ్ మానేరు ప్రాజెక్టులోకి నీళ్ల నింపుతూ.. ఇతర ప్రాజెక్టులకు వదులుతున్నా పర్యాటకానికి మాత్రం మోక్షం కలగడం లేదు. సిరిసిల్ల మిడ్ మానేరు ప్రాజెక్టు బ్యాక్ వాటర్ వద్ద ప్రారంభించిన ఆధునిక బోటు మాత్రం కదలడం లేదు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం హయాంలో 2023 ఆగస్టులో అప్పటి మంత్రులు కేటీఆర్, శ్రీనివాస్ గౌడ్‌లు పర్యాటకానికి శ్రీకారం చుడుతూ ఆధునిక బోట్లను ప్రారంభించారు. బోట్లపై జలవిహారం చేశారు. ఆ తర్వాత పర్యాటక రంగాన్ని పట్టించుకోక పోవడంతో సిరిసిల్ల ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. సిరిసిల్ల మానేరు నుంచి మిడ్ మానేరు ప్రాజెక్టులో సహజసిద్ధ అందాలతో అనుభూతులు పొందే విధంగా పర్యాటక అభివృద్ధికి ప్రతి పాదనలు కూడా సిద్ధం చేశారు.

40 ఎకరాల్లో ఐలాండ్ అభివృద్ధికి మోక్షం కలిగేనా..?

ఇల్లంతకుంట మండలం అనంతగిరి వద్ద గుట్టలను అనుసంధానం చేస్తూ అన్నపూర్ణ, అనంతగిరి ప్రాజెక్టును నిర్మించారు. ఇక్కడే ఆసియాలోనే అతిపెద్ద సర్జ్‌పూల్ బావిని కూడా నిర్మించారు. ప్రాజెక్ట్ మధ్యలో ఉన్న 40 ఎకరాలతో ఉన్న గుట్టను ఐలాండ్‌గా తీర్చిదిద్దాలని నిర్ణయించినా ప్రతిపాదనలకు మోక్షం కలగడం లేదు. ప్రాజెక్ట్ వద్ద సిరిసిల్ల, కరీంనగర్, సిద్దిపేట జిల్లాల ప్రజలకు ఎంతో ఇష్టమైన పోచమ్మ తల్లి

మిగతా 8లో..

పర్యాటకానికి రెండు ప్రాజెక్టులు కీలకం

జిల్లాలోని మిడ్‌మానేరు, అన్నపూర్ణ రెండు ప్రాజెక్టులు పర్యాటకానికి కీలకంగా మారుతాయని భావించారు. వేములవాడల శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం ప్రసిద్ధి చెంది ఆధ్యాత్మికతకు పర్యాటకం తోడవుతుందని అనుకున్నారు. కాళేశ్వరం ఎత్తిపోతల పథకాలకు సిరిసిల్ల మానేరు తీరంలోని శ్రీ రాజరాజేశ్వర మిడ్ మానేరు ప్రాజెక్ట్, అన్నపూర్ణ అనంతగిరి ప్రాజెక్టులు ప్రధానంగా నిలుస్తాయి.

ఈ ప్రాజెక్టుల వద్ద పర్యాటకంగా అభివృద్ధి చేస్తామని 2021 జూలై 4న సిరిసిల్ల జిల్లా పర్యటనకు వచ్చిన అప్పటి ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు మాట్లాడుతూ అనంతగిరి పోచమ్మను దర్శించుకుంటానని, అన్నపూర్ణ అనంతగిరి, శ్రీ రాజరాజేశ్వర మిడ్ మానేరు ప్రాజెక్టులను పర్యాటకంగా అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తానని ప్రకటించారు. వేములవాడ ఆధ్యాత్మికతతో పాటు స్వామివారిని దర్శించుకోవడానికి వచ్చే భక్తులకు పర్యాటకం కూడా స్వాగతం పలుకుతుందని భావించినా ఆచరణలోకి మాత్రం రాలేదు. గతప్రభుత్వ హయాంలో పలుమార్లు రెండు ప్రాజెక్టుల వద్ద పర్యాటక పరిశీలనలు జరిగాయి. మిడ్ మానేరు వద్ద కొడుముంజ గుట్టలను కలుపుకొని రోప్‌వేలు, కాటేజీల నిర్మాణాలు చేపట్టాలని నిర్ణయించారు.

అదేక్రమంలో మిడ్ మానేరు బ్యాక్ వాటర్ సిరిసిల్ల కరకట్ట వద్ద బోటును కూడా సిద్ధం చేసినా కొవిడ్‌తో ప్రారంభానికి నోచుకోలేదు. శాసనసభ ఎన్నికల క్రమంలో హడావిడిగా 2023 ఆగస్టు 18న బోటును నామమాత్రంగా ప్రారంభోత్సవం చేసి వదిలేశారు. ఆ తర్వాత ప్రభుత్వం మారిపోయింది. సిరిసిల్లకు రాజన్న దర్శనానికి వచ్చే భక్తులకు మిడ్ మానేరులోని అందాలను చూసే విధంగా విహరించే అవకాశం అందుబాటులోకి వస్తుందని అనుకున్నా నిరాశగానే మిగిలింది.

రైతులు రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

ఇల్లంతకుంట, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి) : సహకార సంఘంలో రైతులు తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకోవాలని ప్యాక్స్ చైర్మన్ రొండ్ల తిరుపతిరెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని సంఘ భవనంలో సోమవారం ఆరుగురు రైతులకు రూ.21లక్షల దీర్ఘకాలిక రుణాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘ పరిధిలో ఇప్పటి వరకు రూ.1497.60కోట్ల దీర్ఘకాలిక రుణాలు, రూ. 1738.19కోట్ల స్వల్పకాలిక రుణాలు రైతులకు ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో సీఈఓ చిట్టి రవీందర్‌రెడ్డితో పాటు సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సహకార సంఘంలో అక్రమాలపై విచారణ జరపాలి

ఇల్లంతకుంట, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): సహకార సంఘంలో జరిగిన అక్రమాలపై విచారణ జరుపాలని ఇద్దరు డైరెక్టర్లు జిల్లా సహకారశాఖ అధికారికి సోమవారం ఫిర్యాదు చేశారు. ఇల్లంతకుంట సహకార సంఘంలో 2021ఖరీఫ్ సీజన్ నుంచి 2024ఖరీఫ్ సీజన్లలలో ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణలో అవకతవకల వల్ల సంఘానికి దాదాపు రూ. 95లక్షల కోత విధించారని పేర్కొన్నారు. కొంత మంది చేసిన తప్పిదాల వల్ల సంఘంలోని సభ్యులందరూ నష్టపోతున్నారన్నారు. ఫిర్యాదు చేసిన వారిలో ప్యాక్స్ డైరెక్టర్లు చల్ల నవీన్‌రెడ్డి, గన్నారం వసంత, మాజీ డైరెక్టర్ నాయిని నవీన్‌కుమార్, గన్నారం నర్సయ్య తదితరులు ఉన్నారు.

దళిత ఆత్మగౌరవ ర్యాలీని విజయవంతం చేయాలి



సిరిసిల్లలో వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

సిరిసిల్ల టౌన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో నిర్వహించనున్న దళిత ఆత్మగౌరవ ర్యాలీని విజయవంతం చేయాలని ఎంఆర్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి పుట్ట రవి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రం అంబేద్కర్ చౌరస్తాలో వి స్టాండ్ విత్ సీజేఐ బీఆర్ గవాయి అంటూ ఎంఆర్పీఎస్ ఆధ్వర్యంలో ముద్రించిన వాల్‌పోస్టర్‌ను నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పుట్ట రవి మాట్లాడుతూ సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయిపై జరిగిన దాడిని నిరసిస్తూ నవంబర్ 1న హైదరాబాద్‌లో దళిత ఆత్మగౌరవ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంఆర్పీఎస్ జిల్లా కన్వీనర్ బిక్షపతి, నాయకులు ఆవునూరి ప్రభాకర్, ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు ఖానాపురం లక్ష్మన్, జిల్లా కో కన్వీనర్ సావనపెల్లి రాకేష్, వీహెచ్‌పీఎస్ జిల్లా కన్వీనర్ నడిమెల శోభారాణి, ఎంఎస్పీ జిల్లా అధికార ప్రతినిధి గుండ్రేడి రాజు, సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు బడుగు లింగయ్య, వివిధ మండలాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన ఎంపీడీవో



ఎంపిడీవో కీర్తనకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఉద్యోగులు

వేములవాడ టౌన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): వేములవాడ ఎంపిడీవోగా బింగి కీర్తన సోమవారం బాధ్యతలు చేపట్టారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఆమె ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టారు. ఉద్యోగులు ఎంపిడీవోకు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. గ్రూప్-1 ఫలితాల్లో ఎంపిడీవో ఉద్యోగం సాధించి బాధ్యతలు చేపట్టినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీవో వజీర్, సూపరిండెంట్ విజయేందర్‌రెడ్డి, రాజన్‌బాబు, ప్రచాయతీ కార్యదర్శులు దివ్య, జీవిత, శ్రావణి ఉన్నారు.

అన్నదాతలు ఆందోళన చెందవద్దు

- తడిసిన ధాన్యం కొనుగోలు చేస్తాం

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు27(ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన ధాన్యం అకాల వర్షాలకు తడిసినా ప్రభుత్వం కొనుగోలు చేస్తోందని, అన్నదాతలు ఎవరూ ఆందోళన చెందవద్దని ఏఎంసీ చైర్‌పర్సన్ సబేరాబేగం అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతో పాటు రాచర్లబొప్పాపూర్ గ్రామాల్లోని ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను తహసీల్దార్ సుజాత, స్థానిక నాయకులతో కలిసి సోమవారం ఆమె సందర్శించారు. ఇటీవల కురిసిన వర్షానికి తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు. తేమ శాతం వచ్చిన ధాన్యం తూకం వేయకపోవడం వల్ల ధాన్యం తడిసిపోయిందని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. తడిసిన, రంగు మారిన ధాన్యం ప్రభుత్వం కొనుగోలు చేసి ఆదుకోవాలన్నారు. దిగులు చెందవద్దని కొనుగోళ్లలో ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. కొనుగోళ్లను వేగవంతం చేసి అన్ని వసతులను కల్పించాలని నిర్వాహకులను ఆదేశించారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సయ్య, మండల శాఖ అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు గౌస్ తదితరులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం ఇవ్వాలి

● ఇన్‌చార్జి కలెక్టర్ గరిమా అగర్వాల్

● కేజీబీవీలో ఆకస్మిక తనిఖీ



విద్యార్థులతో మాట్లాడుతున్న ఇన్‌చార్జి కలెక్టర్ గరిమా అగర్వాల్



నేరెళ్ల పీహెచ్‌సీలో రికార్డుల పరిశీలన

తంగళ్లపల్లి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని ఇన్‌చార్జి కలెక్టర్ గరీమా అగర్వాల్ ఆదేశించారు. సోమవారం తంగళ్లపల్లి మండలం పద్మనగర్ శివారులోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని తనిఖీ చేశారు. దీంట్లో భాగంగా స్టోర్ రూమ్‌లోని వస్తువులు, కోడి గుడ్లు, కూరగాయలు పరిశీలించారు. కోడి గుడ్లపై స్టాంప్ ఉండేలా చూసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యా ర్థులతో పాటు కింద కూర్చుని మెనూ ప్రకారం చికెన్, మటన్, కోడిగుడ్లు ఇస్తున్నారా అని ఆరా తీశారు. పోషకాహారం తీసుకోవాలని విద్యార్థులకు సూచించారు. పర్యావరణ, భవిష్యత్ ప్రణాళికల అంశలపై చర్చించారు. అలాగే విద్యాలయంలో 9 వతరగతి విద్యార్థులకు బయోసైన్సులోని ఫొటో సింథసిస్‌పై వివరించారు. విద్యార్థులందరూ చదువుపై శ్రద్ధ పెట్టాలని అన్నారు. తాము అనుకున్న ఉద్యోగాలు, ఉన్నత స్థానాలకు ఎదిగి ఆర్థికంగా స్థిరపడాలని ఆకాంక్షించారు. విద్యాలయం అవరణ నిత్యం పరిశుభ్రంగా ఉండాలని, ఏమైనా ఇబ్బందులు ఉంటే దృష్టికి తీసుకురావాలని సూచించారు. విద్యాలయంలో ఇబ్బందులు, సమస్యలను పరిష్కరించాలని డీఈవోను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కస్తూర్బా ప్రత్యేకాధికారి శ్యామల, సిబ్బంది ఉన్నారు.

నేరెళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ

● విధులకు గైర్హాజరైన ఇద్దరికి నోటీసులు

తంగళ్లపల్లి: సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలని జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ గరిమా అగర్వాల్ సూచించారు. సోమవారం తంగళ్లపల్లి మండలం నేరెళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ముందుగా వైద్యులు, సిబ్బంది హాజరు రిజిష్టరు, రక్త పరీక్షలు చేసే ల్యాబ్, మందుల రూం పరిశీలించారు. వ్యాక్సీన్లు , మందుల నిల్వలపై ఆరా తీశారు. ఎలాంటి సమాచారం లేకుండా విధులకు గైర్హాజరైన ఫార్మసిస్ట్, సూపర్ వైజర్లకు షోకాజ్ నోటీసులు ఇవ్వాలని వైద్యాధికారిని ఆదేశించారు. నిత్యం అసుపత్రికి ఎంత మంది రోగులు వస్తున్నారని, ఎందరు గర్భిణులు వైద్య సేవలు పొందుతున్నారని ఆరా తీశారు. సీజనల్ వ్యాధులు, పరిసరాల పరిశుభ్రతపై వివరించాలని తెలిపారు. కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

వర్షాల ప్రభావంతో రైతులు అప్రమత్తంగా ఉండాలి

తంగళ్లపల్లి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): రానున్న మూడు రోజులు వర్షాలు పడే సూచనల నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని తహశీల్దార్ జయంత్‌కుమార్ ఒక ప్రకటనలో సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో తూకం వేసిన వరిధాన్యం రైస్ మిల్లులకు తరలించాలన్నారు. ఆరబోసిన వరిధాన్యం కుప్పలుగా చేసి తడవకుండా కవర్ కప్పి జాగ్రత్తలు తీసుకోవాలని, రాబోయే మూడు రోజులు వరి కోతలు నిలిపివేయాలని సూచించారు. రైతులు ముందు జాగ్రత్త చర్యలు పాటించి అధికారులకు సహకరించాలని కోరారు.

వేములవాడలో కార్తీక దీపోత్సవం



కార్తీక దీపాలు వెలిగిస్తున్న ఈవో రమాదేవి



భీమన్న ఆలయంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు

వేములవాడ కల్చరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): శివుడికి, విష్ణువుకు అత్యంత ప్రీతి కరమైన కార్తీక మాసంలో భక్తులు భీమన్న ఆలయంలో కార్తీక దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. భీమన్న ఆలయంలో ఏర్పాటు చేసిన సామూహిక కార్తీక దీపోత్సవంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని దీపాలు వెలిగించి శివపార్వతులను ఆరాధించారు. పసుపు కుంకుమలు, పాడిపంటలు, పిల్లపాపలు చల్లంగా ఉండాలని శ్రీపరమేశ్వరుని వేడుకున్నారు. కార్తీక దీపోత్సవంలో రాజన్న ఆలయ ఈవో రమాదేవి పాల్గొని కార్తీక దీపాలు వెలిగించారు.

రాజన్న ఆలయంలో మహాలింగార్చన..

వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి ఆలయంలో కార్తీక మొదటి సోమవారం పురష్కరించుకుని మహాలింగార్చన ఆలయ అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఉదయం శ్రీస్వామి వారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం సాయంత్రం అద్దాల మండపం వద్ద లింగాకృతిలో దీపాలను వెలిగించారు.

లింగన్నపేట పీహెచ్‌సీలో టీబీ ముక్త్ భారత్ అభియాన్

గంభీరావుపేట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) గంభీరావుపేట మండలం లింగన్నపేట ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం టీబి ముక్త్ బారత్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా టీబి యూనిట్ గంభీరావుపేట క్లస్టర్ 60 మంది టీబి వ్యాధి బాధితులకు ఫుడ్ బాస్కెట్ పంపిణీ చేశారు. అనంతరం ముస్తాబాద్‌కు చెందిన పీపుల్స్ హాస్పిటల్ వైద్యులు శంకర్, 60 మంది క్షయ వ్యాధి గ్రస్తులను న్యూట్రిషన్ ఫుడ్ కొరకు 6 నెలల పాటు దత్తత తీసుకుని, ప్రతి నెల 600 విలువ గల బియ్యం, పప్పు, నూనె, పల్లి, గుడ్లు, ప్రోటీన్ పౌడర్ లాంటివి ఇవ్వనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు అభినయ్, సీహెచ్‌వో రమేష్, టీబి యూనిట్ సూపర్‌వైజర్ మహిపాల్, టీబి నోడల్ అధికారి సీతామహాలక్ష్మి ఉన్నారు.

రైతు కుటుంబాన్ని పరామర్శించిన కేంద్ర మంత్రి

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు27(ఆంధ్రజ్యోతి): అధైర్య పడకండి.. అండగా ఉంటానని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ భరోసా కల్పించారు. ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్‌లో ఇటీవల వరి ధాన్యం కొనుగోలు కేంద్రంలో ధాన్యం ఆరబెడుతూ గుండెపోటుతో మృతి చెందిన రైతు, బీజేపీ నాయకుడు నిమ్మల సత్యం కుటుంబ సభ్యులను సోమవారం ఆయన సెల్ ఫోనులో పరామర్శించారు.

సత్యం కుమారుడితో మాట్లాడి మృతి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. కుటుంబంలో ఎవరెవరు ఉన్నారని ప్రశ్నించారు. ధైర్యంగా ఉండాలని సూచించారు. ఉన్నత చదువుల కోసం తనవంతు కృషి చేస్తానని స్పష్టం చేశారు.

మహిళ అదృశ్యం.. కేసు నమోదు


దేశ్పాల్ శోభ

హుజూరాబాద్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డిజిల్లా రాజేంద్రనగర్ మండలం, ఉప్పర పల్లి గ్రామానికి చెందిన దేశ్పాల్ శోభ నాలుగు రోజులక్రితం తన చిన్నకూతురుకు వద్దకు వచ్చి అదృశ్యం అయింది. ఈ మేరకు కేసు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు పోలీసులు టౌన్ సీఐ కరుణాకర్ తెలిపారు. వివరాల్లోకి వెళితే.. హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రిలో డెలివరీ అయిన తన చిన్న కూతురు చూడడానికి శోభ వచ్చింది. సోమవారం ఉదయం ఏరియా ఆస్పత్రి నుంచి బయటకు వెళ్లిన ఆమె తిరిగిరాలేదు. దీంతో కుటుంబసభ్యులు పట్టణంతోపాటు బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. శోభ పెద్ద కూతురు గీత ఇచ్చిన ఫిర్యాదుమేరకు మిస్సింగ్ కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్‌సీఐ కరుణాకర్ తెలిపారు. ఎవరికైనా ఆచూకీ తెలిస్తే 8712670773, 8712574726 నంబర్లకు సమా చారం ఇవ్వాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

కరీంనగర్ క్రైం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండలం నాగుల మల్యాల శివారులో సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డుప్రమాదంలో నాగులమల్యాలకు చెందిన చేకూరి సతీష్(30) మృతిచెందాడు. కొత్తపల్లి సీఐ బిల్ల కోటేశ్వర్ వివరాల ప్రకారం.. నాగుల మల్యాలకు చెందిన సతీష్ గ్రానైట్ లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం సాయంత్రం విధులు ముగించుకొని బావుపేటనుంచి బైక్‌పై ఇంటికివస్తున్న క్రమంలో నాగుల మల్యాల శివారులోని మూలమలుపు వద్ద బైక్‌అదుపుతప్పి చెట్టును ఢీకొం ది. దీంతో తీవ్రంగా గాయపడిన సతీష్ అక్కడికక్కడే మృతిచెందాడు. సతీష్ మృతిదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీ గదిలో భద్రపరిచారు.

- ఇంటర్, డిగ్రీ, బీటెక్ విద్యార్థులకు స్కాలర్‌షిప్
- పోస్టుమెట్రిక్ దరఖాస్తులకు 31 వరకు గడువు

కార్మికుల పిల్లలకు కేంద్రం చేయూత



చొప్పదండి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కార్మికుల పిల్లల విద్య కోసం కేంద్ర ఉపాధి మంత్రిత్వ శాఖ స్కాలర్‌షిప్‌లను అందజేస్తోంది. 1వ తరగతి నుంచి బీటెక్, బీఏఎంఎస్ కోర్సులు చదివే విద్యార్థులకు ప్రీ మెట్రిక్, పోస్టు మెట్రిక్ స్కాలర్‌షిప్‌లను. వెయ్యి రూపాయల నుంచి 25 వేల రూపాయల వరకు అందజేస్తోంది. పోస్టుమెట్రిక్‌కు సంబంధించిన ఇంటర్, డిగ్రీ, బీటెక్, బీఏఎంఎస్, ఐటీఐ, ప్రొఫెషనల్ కోర్సులు చదివే విద్యార్థులు ఈ నెల 31లోగా దరఖాస్తును చేసుకోవాలి.

● బీడి కార్మికులు, ఐవోఎంసీ, ఎల్ఎస్‌డీఎం కార్మిక కుటుంబాలకు చేయూత..

బీడి కార్మికుల పిల్లలతోపాటు ఐరన్ ఓర్, మాంగనీస్ ఓర్, లైంస్టోన్ మైన్స్, డోలోమైట్, మైకా మైన్స్, సినీ కార్మికుల కుటుంబాల పిల్లలకు కేంద్ర ప్రభుత్వం స్కాలర్‌షిప్‌లను అందజేస్తుంది. 1వ తరగతి నుంచి ఇంటర్, డిగ్రీ, ప్రొఫెషనల్ కోర్సులకు వెయ్యి నుంచి 25 వేల రూపాయల వరకు డీబీటీ (డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్) పద్ధతిలో నేరుగా విద్యార్థుల ఖాతాలకే నగదును బదిలీ చేస్తారు.

● దరఖాస్తు.. అర్హతలు..

విద్యార్థులు ఎన్ఎస్‌పీ (నేషనల్ స్కాలర్‌షిప్) పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. విద్యార్థులు పదో తరగతి, ఇంటర్‌లో రెగ్యులర్ పద్ధతిలో పాసై ఉండాలి. సప్లిమెంటరీలో పాసైన విద్యార్థులు అనర్హులు. దూర విద్యను అభ్యసించే విద్యార్థులు దరఖాస్తు చేసుకోవడానికి వీలు లేదు. ఈ నెల 31 లోగా దరఖాస్తును ఆన్‌లైన్‌లో సమర్పించుకోవాల్సి ఉంటుంది. ఇంటర్ విద్యార్థులకు 3 వేల రూపాయలు, డిగ్రీ, ఐటీఐ, పాలిటెక్నిక్, ఇతర ప్రొఫెషనల్ కోర్సుల విద్యార్థులకు 6 వేలు, బీటెక్, ఎంబీఏఎస్, బీఏఎంఎస్ కోర్సులు చదివే విద్యార్థులకు ఏడాదికి 25 వేల రూపాయల ఉపకార వేతనం అందుతుంది. ప్రభుత్వ అనుమతి ఉన్న కళాశాలల్లో 2025-26 విద్యా సంవత్సరంలో చదువుతున్న విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవడానికి అర్హులు. బీడి కార్మికులు, మైన్ కార్మికుల వేతనం 10 వేలలోపు ఉండాలి. సినీ కార్మికుల వేతనం నెలకు ఎనిమిది వేల రూపాయలు ఉండాలి. కార్మికుల గుర్తింపు కార్డు, బ్యాంకు ఖాతా, విద్యార్హత మెమో, తహసీల్దార్ కార్యాలయం నుంచి ఆదాయ ధ్రువీకరణ పత్రాన్ని దరఖాస్తుతో సమర్పించాల్సి ఉంటుంది.

నా కొడుకు మృతికి కారణమైన వారిపై చర్య తీసుకోవాలి

మంథని, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): తన కొడుకు ఆత్మహత్య చేసు కోవటానికి కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని మున్సిపల్ పరిధిలోని శ్రీపాదకాలనీకి చెందిన శీలం రాజేశ్వరి సోమవారం ఒక ప్రకటనలో కోరా రు. రాజ్‌కుమార్ ఆత్మహత్య చేసుకోవటానికి కారణమైన వారిపై మంథని పోలీసులకు ఫిర్యాదుచేసి నెలలుగడిచినా ఇప్పటివరకు చర్యలు తీసుకోలే దని వాపోయారు. శ్రీపాదకాలనీలోని ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద 2024 డిసెంబర్ 6న జరిగిన గొడవ నేపథ్యంలో తన కొడుకు పై ఫిర్యాదు మేరకు మంథని ఎస్ఐ రమేష్ కొట్టడంతో అవమానభారంతో డిసెంబర్ 8న ఉరివేసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడన్నారు. తాము గమ నించి ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించగా 2025 సెప్టెంబరు 19న రాజ్‌కుమార్ మృతి చెందినట్లు తెలిపారు. రాజ్‌కుమార్ మృతికి పీఏసీఎస్ చైర్మన్ కొత్త శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు గుండా పాపారావు, మూల పురుషోత్తంరెడ్డిల ఒత్తిడేకారణమని ఆరోపించారు. వారిపై పోలీసులు చర్య లు తీసుకొని న్యాయంచేయాలని ఆమెపోలీసు ఉన్నతాధికారులను కోరారు.

ద్విచక్రవాహనం అదుపు తప్పి తండ్రీ, కొడుకుకు గాయాలు

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ఓ ప్రైవేటుపాఠశాల నుంచి ద్విచక్రవాహనంపై వెళుతున్న క్రమంలో అదుపుతప్పి ఐదేళ్ల వయసు ఉన్న విద్యార్థి ప్రణయ్, తండ్రి రాజు సోమవారం పక్కనే ఉన్న మురుగు నీటి కాల్వలో పడిపోయారు. విద్యార్థి, తండ్రికి స్వల్పగాయాలయ్యాయి. గ్రామంలోని రాజు కొడుకు ప్రణయ్ స్థానిక ఓ ప్రైవేటు పాఠశాలలో నర్సరీ చదువుతున్నాడు. కొడుకు తీసుకుని బైక్‌పై వెళ్తున్న రాజు ఎదురుగా బస్సు రావడంతో రోడ్డు పక్కన ఆగాడు. కాలు కింద పెట్టడడం వల్ల అదుపు తప్పి మురుగు నీటి కాల్వలో పడిపోయారు. గమనించిన వాహనదారులు కాల్వలోని తండ్రీకొడుకులను బయటకు తీయడంతో ఊపిరి పీల్చుకున్నారు.

వెండి నాణేలపై అధికారుల విచారణ


వెండి నాణేలను పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు

జూలపల్లి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చీమలపేటలో వెండి నాణె ములు లభ్యమైనట్లు రెవెన్యూ పోలీసు అధికారులు తెలిపారు. చీమలపేట గ్రామానికి చెందిన తొంటి రాజు పాతఇంటిని బ్లేడ్ ట్రాక్టర్‌తో సహాయంతో చదును చేస్తుండగా 10వెండి నాణె ములు లభ్యమైనట్లు అధికా రులు పేర్కొన్నారు. సోమ వారం గ్రామంలో విచారణ చేపట్టిన అధికారులు వాటిని స్వాధీనం చేసు కున్నారు. ఈ నాణెములు 1925సంవత్సరం నిజాంప్రభువు పాలనలో ముద్రించినట్లు ఆధారాలు ఉన్నట్లు అదికారులు తెలిపారు. నాయబ్ తహసీల్దార్ అనిల్‌కుమార్, గిర్దవర్ భవానిప్రసాద్, పోలీసులు అజీమ్ పలువురు గ్రామస్తులు ఉన్నారు.

ఎస్‌యూ స్నాతకోత్సవానికి గవర్నర్‌కు ఆహ్వానం


గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న ఎస్‌యూ వీసీ ఉమేష్‌కుమార్

గణేశ్‌నగర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): శాత వాహన విశ్వవిద్యాలయం లో వచ్చేనెల7న నిర్వహిం చనున్న 2వ స్నాతకోత్సవం సందర్భంగా రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్‌వర్మకు యూని వర్సిటీ వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ ఉమేష్ కుమార్ ఆహ్వాన పత్రిక అందజే శారు. సోమవారం హైదరా బాద్‌లో గవర్నర్‌ను కలి శారు. స్నాతకోత్సవానికి సంబంధించిన అన్ని పనులూ దాదాపు పూర్త వుతున్నాయని వివరించారు. రిజిస్ట్రార్ ఆచార్య జాస్తి రవికుమార్, పరీక్షల నియం త్రణ అధికారి డాక్టర్ సురేష్ కుమార్ ఉన్నారు.

హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

జగిత్యాల టౌన్, అక్టోబరు 27 (ఆంధ్ర జ్యోతి): పాతకక్షల నేపథ్యంలో హత్యచేసిన నిందితుడు మహేష్‌కు జీవితఖైదు, రూ.5 వేల జరిమానా విధిస్తూ జిల్లాప్రధాన న్యాయ మూర్తి రత్నపద్మావతి తీర్పునిచ్చారు. జగి త్యాల పట్టణం హనుమాన్‌వాడకు చెందిన తోటశేఖర్, బీట్‌బజార్ చెందిన సామాండ్ల మహేష్‌కు పాతగొడవలు ఉండేవి. ఈ నేప థ్యంలో 2023అక్టోబరు 16న శేఖర్‌కు అతిగా మద్యం తాగించి మహేష్ కత్తితో పొడిచి హత్యచేశాడు. మృతుడిభార్య ఫిర్యాదు మేరకు జగిత్యాలటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడిని కోర్టులో హాజరుపరిచారు. సాక్షు లను విచారించిన అనంతరం నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి జీవితఖైదు విధిస్తూ తీర్పు చెప్పారు.

నిందితుడికి శిక్ష పడడంలో కృషిచేసిన పిపి మల్లికార్జున్, అప్పటి ఇన్వెస్టిగేషన్ ఇన్‌స్పెక్టర్ కిషోర్‌ను ఎస్పీ అశోక్ కుమార్ అభినందించారు.

దాడి కేసులో నిందితుడికి రెండేళ్ల జైలు

జగిత్యాల టౌన్, అక్టోబరు 27 (ఆంధ్ర జ్యోతి): మద్యం మత్తులో ఓ వ్యక్తిపై దాడి చేసి దూషించిన కేసులో నిందితుడైన ప్రశాం త్‌కు రెండు సంవత్సరాల జైలు శిక్ష, రూ.4,200 జరిమానా విధిస్తూ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి ఆర్ లావణ్య తీర్పు వెలువరించారు. జగిత్యాల మండలం తాటిపెల్లి గ్రామానికి చెందిన మారంపెల్లి లక్ష్మణ్‌ను 2022 నవంబర్ 13న ప్రశాంత్ అనేవ్యక్తి మద్యం మత్తులో దూషించి దాడిచేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు జగిత్యాలరూరల్ పోలీసులు కేసు నమోదుచేశారు. ఏపీపీ, కోర్టుడ్యూటీ అధికారు లు సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా విచారణ జరిపిన న్యాయమూర్తి నిందితుడికి రెండు సంవత్సరాల జైలుశిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. కేసులో నిందితుడికి శిక్షపడేందుకు కృషిచేసిన ఏపీపీ రాజేష్, ఎస్సై అనిల్, సీడీవో నాగరాజు, సీఎంఎస్ ఎస్సైని ఎస్పీ అభినందించారు.

బాలికపై అత్యాచారం కేసులో నిందితుడికి 20ఏళ్ల జైలు

●బాధితురాలికి రూ.7 లక్షల పరిహారం చెల్లించాలని తీర్పు

జగిత్యాల టౌన్, అక్టోబర్, 27 (ఆంధ్రజ్యోతి) : మైనర్‌బాలికపై అత్యాచారం కేసులో నింది తుడికి 20ఏళ్ల కఠినకారాగార జైలుశిక్ష, రూ.10 వేల జరిమానాతోపాటు బాధితురాలికి రూ.7 లక్షల పరిహారం అందించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి రత్నపద్మావతి సోమవారం తీర్పుచెప్పారు. 2023లో కొడిమ్యాల పోలీస్ స్టేషన్‌పరిధిలో కట్కూరిఅశోక్ అనేనిందితుడు బాలికను అత్యాచారంచేసిన ఘటనలో పోక్సో చట్టం కిందకేసు నమోదుచేశారు. అప్పటి ఇన్ స్పెక్టర్లు కృష్ణకుమార్, కిషోర్ రమణమూర్తి కేసు విచారణచేసి ఫాస్ట్ ట్రాక్‌స్పెషల్‌కోర్టుకు ఆధారాలు సమర్పించారు. పీపీ, కోర్టుడ్యూటీ అధికారులు సాక్ష్యులను ప్రవేశపెట్టగా సోమ వారం ప్రధానన్యాయమూర్తి రత్నపద్మావతి తీర్పునిచ్చారు. నిందితుడికి శిక్షపడడంలో కృషి చేసిన పీపీ రామకృష్ణారావు, ఇన్వెస్టిగేషన్ ఆఫీ సర్ ఇన్‌స్పెక్టర్‌లు కృష్ణకుమార్, కిషోర్, రమ ణమూర్తి, సీఎంఎస్ ఎస్సైశ్రీకాంత్‌లను ఎస్పీ అశోక్‌కుమార్ ప్రత్యేకంగా అభినందించారు.

ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య


ఆదిత్య(ఫైల్)

బోయినపల్లి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): హాస్టల్‌కు వెళ్లడం ఇష్టం లేక రాజన్నసిరిసిల్ల జిల్లా బోయిన్‌పల్లి మండలకేంద్రంలో ఇంటర్ విద్యార్థి పురుగులమందు తాగి ఆత్మహత్య చేసు కున్నాడు. బోయిన్‌పల్లికి చెందిన పిట్టల మల్లేశం కుమారుడు ఆదిత్య(17) కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. దీపావళి పండుగకు హాస్టల్ నుంచి ఇంటికి వచ్చిన ఆదిత్య సెలవులు ముగిశాక హాస్ట ల్‌కు వెళ్లలేదు. కుటుంబసభ్యులు హాస్టల్‌కు వెళ్లాలని ప్రాధేయపడ్డారు. ఆదిత్య హాస్టల్‌కి వెళ్లడం ఇష్టం లేక ఆత్మహత్యకు ప్రయత్నించాడు. సోమవారం ఉదయం గ్రామంలోని ఓ రైతు పొలం వద్ద పురుగుల మందుతాగి అపస్మారక స్థితిలో కనిపించాడు. వెంటనే కుటుంబసభ్యులు కరీంనగర్‌లోని ఆసుప త్రికి తరలించగా చికిత్సపొందుతూ మృతిచెందాడు. తండ్రి మల్లేశం ఫిర్యాదుమేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు బోయిన్‌పల్లి ఎస్సై రమాకాంత్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


మనోజ్(ఫైల్)

కోరుట్ల, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కోరుట్ల పట్టణంలోని ఐబీ రోడ్డులో ఆదివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో బాలాజీ రోడ్డుకు చెందిన దామ మనోజ్(28) అనే యువకుడు మృతిచెందగా మరొకరికి గాయాలయ్యాయి. దామమనోజ్ అనేయువకుడు తన స్నేహితు డైన పుప్పాల మహేష్‌తో ద్విచక్ర వాహనంపై ఐబీ రోడ్డు మీదుగా ఇంటికి వెళ్తుండగా ఆవును ఢీకొట్టి రోడ్డుపై పడిపోయారు. అదే సమ యంలో అటుగావస్తున్న లారీ దామ మనోజ్‌పై నుంచి పోవడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ప్రమాదంలో మహేష్ స్వల్పగాయాలతో బయటపడినట్లు పోలీసులు తెలిపారు. కాగా మనోజ్‌కు సోమవారం వివాహ విషయమై అమ్మాయి తరపు వారితో మాట్లాడాల్సి ఉండగా అంతలోనే రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో ఆ కుటుంబంలో విషాదం నెలకొంది. మనోజ్ తల్లి పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఆగిఉన్న ట్రాక్టర్‌ను ఢీకొని డిగ్రీ విద్యార్థి మృతి

హుజూరాబాద్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణం లో ఆగిఉన్న ట్రాక్టర్‌ను ఢీకొని డిగ్రీవిద్యార్థి మృతిచెందిన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపినవివరాల ప్రకారం.. హుజూరాబాద్ పట్టణంలోని కాకతీయకాలనీకి చెందిన వేములవాడ అక్షయ్‌సాయి(18) అనేయువకుడు కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్‌కళాశాలలో డిగ్రీ చదువుతున్నాడు. తనస్నేహితుడిని తీసుకరావడానికి హుజూరా బాద్ నుంచి రంగాపూర్ గ్రామానికి ద్విచక్రవాహనంపై వెళ్తున్నాడు. జమ్మికుంట రోడ్‌లోని గెలాక్సీ సూపర్‌మార్కెట్ వద్ద మున్సిపల్ ట్రాక్టర్ డివైడర్లలో మట్టిని పోయడానికి ఆపాడు. ఈ క్రమంలో అక్షయ్‌సాయి ట్రాక్టర్‌ను గమనించకుండా వెనుకనుంచి ఢీ కొట్టాడు. దీంతో అతనికి తీవ్ర గాయాలు కాగా గమనించిన స్థానికులు వెంటనే ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారిం చారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు నమోదు చేసుకున్నారు. చేతికందిన కొడుకు మృతి చెందడంతో కుటుంబంలో విషాదచాయలు అలుముకున్నాయి.

కాలువలో పడి ఒకరి మృతి

కోనరావుపేట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కోనరావుపేట మండలం మల్కపేట శివారులోని కల్వర్టు కింద ఉన్న కాలువలో పడి ఒక వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చిన్నబోనాల గ్రామానికి చెందిన గోస్కుల పరశురాములు (42) ఆదివారం కోన రావుపేట మండల కేంద్రంలోని అత్తగారింటికి వచ్చాడు. అక్కడ మద్యం సేవించి ద్విచక్ర వాహనంపై వస్తుండగా మల్కపేట గ్రామ శివారులో పోలీసులు నిర్వహిస్తున్న డ్రంక్ అండ్ డ్రైవ్‌లో దొరికాడు. పోలీసులు అతని ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకొని బస్సు ఎక్కించి పంపించారు. మల్కపేట శివారులో బస్సు దిగి కింద పడుతూ వెళ్లాడు. మల్కపేటలో ఉన్న తల్లి కనకవ్వ కుటుంబ సభ్యులు రాజు ఎంతకు ఇంటికి తిరిగిరాకపోవడంతో సోమవారం ఉదయం వెతుకు తుండగా మల్కపేట శివారులోని బ్రిడ్జికింద ఉన్న కాలువలో పడి మృతిచెందినట్లు గుర్తించారు. ఈవిషయమై కోనరావుపేట ఎస్సై ప్రశాంత్‌రెడ్డికి తల్లికనకవ్వ మల్కపేటశివారులోని బ్రిడ్జికాలువలోపడి మృతి చెందాడా?, ఇంకేమన్నా కారణాలు ఉన్నాయా అనే విషయంపై ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రాంచంద్రాపూర్‌లో చోరీ

● నాలుగు తులాల బంగారం అపహరణ


చోరీ జరిగిన తీరును పరిశీలిస్తున్న ఎస్ఐ ఉపేంద్ర చారి

తంగళ్లపల్లి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండలం రాంచంద్రపూర్ గ్రామంలో పట్ట పగలు చోరీ జరిగింది. వివరాల్లోకి వెళితే.. సిరిసిల్ల-సిద్ధిపేట ప్రధానరహదారి పక్కన ఇట్టి రెడ్డి రాజిరెడ్డి ఇంట్లో సోమవారం గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. మధ్యాహ్నం ఇంటికి తాళం వేసి బయటికి వెళ్లి సాయంత్రం తిరిగి వచ్చే సరికి ఇంటితాళం పగల గొట్టి బీరువాలో ఉన్న 4తులాల బంగారం ఎత్తుకె ళ్లినట్లు గుర్తించారు. పోలీసులకు సమాచారం అందివ్వడంతో ఎస్ఐ ఉపేంద్ర చారి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. డాగ్ స్క్వాడ్, క్లూస్ టీం రప్పించి ఆధారాలు సేకరిస్తున్నారు.

రేషన్ దుకాణాల్లో ముక్కిపోతున్న దొడ్డు బియ్యం

- ఇబ్బందులు పడుతున్న డీలర్లు, లబ్ధిదారులు


ఇబ్రహీంపట్నం మండలంలోని రేషన్‌దుకాణంలో పురుగులు పట్టిన దొడ్డు బియ్యం సంచులు

ఇబ్రహీంపట్నం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం మండలంలోని పలు రేషన్‌దుకాణాల్లో దొడ్డుబియ్యం ముక్కిపోతున్నాయి. ప్రభుత్వం గత ఏప్రిల్ నుంచి సన్న బియ్యం పథకం ప్రారంభించిన నేపథ్యంలో రేషన్ లబ్ధిదారులకు సన్న బియ్యం పంపిణీ ప్రారంభించారు. అయితే మార్చి నెలలో అందజేసిన దొడ్డు బియ్యం కొన్ని రేషన్ దుకాణాల్లో లబ్ధిదారులు తీసు కోకపోవడంతో మిగిలిపోయాయి. మండలం లోని 22రేషన్ దుకాణాల్లో సుమారుగా 80క్వింటాళ్ల దొడ్డు బియ్యం మిగిలిపోయాయి. అయితే మిగిలిపోయిన బియ్యాన్ని సివిల్ సప్లయిస్ అధికారులు వాపసు తీసు కోకపోవడంతో రేషన్‌దుకాణాల్లో ముక్కి పోతున్నాయి. బియ్యం సంచులకు పురు గులు పట్టి అవి కాస్త ప్రస్తుతం పంపిణీ చేస్తున్న సన్న బియ్యం సంచులకు సోకి ఇబ్బందులు ఎదురవుతున్నాయని రేషన్ డీలర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని మండల రేషన్ డీలర్లు కోరుతున్నారు.

● టెండర్లు పిలుస్తాం..

- వరప్రసాద్, తహసీల్దార్, ఇబ్రహీంపట్నం



రేషన్ దుకాణాల్లో మిగిలిపో యిన బియ్యానికి ప్రభుత్వం టెండర్లు పిలుస్తుంది. టెండర్లు దక్కించుకున్న గుత్తేదారు సదరు బియ్యానికి మార్కెట్ ధర చెల్లించి తీసుకువెళ్తారు. రాష్ట్రవ్యాప్తంగా అన్నిరేషన్ దుకాణాల్లో మిగిలి పోయిన దొడ్డు బియ్యానికి ఈ వారంలోనే టెండర్లు పిలిచే అవకాశం ఉంది.

దొంగతనం కేసులో ఒకరికి జైలు శిక్ష

హుజూరాబాద్, అక్టోబరు 27 (ఆంధ్ర జ్యోతి): దొంగతనం కేసులో ఓ వ్యక్తికి జైలుశిక్ష విధించినట్లు పోలీసులు తెలిపారు. హుజూరాబాద్ పట్టణంలోని విద్యానగర్‌కు చెందిన గూడ హరికృష్ణ డిసెంబరు 14, 2023లో ఇంటికి తాళంవేసి తనసొంత గ్రామం బొమ్మకల్‌కి వెళ్లాడు. డిసెంబరు 19, 2023న హరికృష్ణ పనిమనిషి ఇంటిని శుభ్రం చెద్దామని ఇంటికి రాగా తలుపులు తీసి ఉన్నాయి. వెంటనే యజమానికి విషయం తెలపగా, హరికృష్ణ ఇంటికి వచ్చి చూసేసరికి బీరువాలో రూ.52వేలు దొంగలించారని పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. అప్పటి సీఐ రమేష్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేసి నిందితుడిని పట్టుకొని కోర్టులో హాజరుపరి చారు. హుజూరాబాద్ కోర్టు కానిస్టేబుల్ మహ్మద్ యూసుఫ్ కోర్టులో సాక్షులను ప్రాసిక్యూషన్ తరుపున పీపీ రమాఉపేందర్ కేసును వాదించగా, జడ్జీ పద్మసాయిశ్రీ సోమవారం నింధితుడికి ఒక సంవత్సరం 8 నెలల శిక్ష విధించారు.

హుజూరాబాద్‌లో కొండచిలువ కలకలం


రోడ్డుపై నుంచి వెళ్తున్న కొండచిలువ

హుజూరాబాద్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): హుజూరా బాద్ పట్టణంలో సోమవారం రాత్రి కొండచిలువ కలకలం సృష్టించింది. పట్టణంలోని జమ్మికుంట రోడ్‌లోని లక్కీ వైన్స్‌వద్ద కొండచిలువ రహ దారి మీదకు వచ్చింది. దీంతో ప్రయాణికులు, స్థానికులు భయాందోళనకు గురయ్యారు. స్థానికులు కొండచిలువను పక్కనేఉన్న అటవీప్రాంతంలో వదిలి పెట్టారు.

కొండ చిలువను చంపిన కోతులు..

ముత్తారం: మండలంలోని కేశనపల్లి గ్రామంలో కోతులు అన్ని కలిసి ఓ కొండ చిలువను చంపేసి వాటి ఐక్యమత్యాన్ని చాటాయి. సోమవారం గ్రామానికి చెందిన చొప్పరి రవి ఇంటి పరిసరాల్లోకి కొండచిలువ వచ్చింది. సుమారు అది ఏడు అడుగుల పొడవు ఉంది. చెట్టుపై ఉన్న ఓ కోతిపిల్లను పట్టుకుని మెల్లమెల్లగా మింగింది. ఈ క్రమంలో చుట్టు పక్కల ఉన్న కోతుల గుంపు దానిని బెదిరిస్తున్నా కొండ చిలువ కోతిపిల్లను వదలకుండా పూర్తిగా మింగే సింది. దీంతో ఆవేశంలో ఉన్న కోతులన్నీ కలిసి ఆ కొండ చిలువను కొరికి చంపే శాయి.

ఉరి వేసుకొని ఒకరి ఆత్మహత్య


బూరారం(ఫైల్)

కరీంనగర్ క్రైం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కొత్త పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని బావు పేటలో రాజస్థాన్ లోని నాగోల్ జిల్లా బర్నెల్‌కు చెందిన బూరారం(32) అనే కూలీ సోమవారం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు కొత్త పల్లి సీఐ బిల్లకోటేశ్వర్ తెలిపారు. బూరారం సాయిశంకర్ గ్రానైట్స్ కటింగ్‌ఫ్యాక్టరీలో కూలీగా పని చేస్తున్నాడని, కుటుంబ కల హాలతో అద్దెకు ఉంటున్న రేకులషెడ్డులో ఉరేసుకున్నాడని పేర్కొన్నారు. టేకేదార్ హీరాలాల్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రాజన్న ఆలయంలో అభివృద్ధి పనులు


రాజన్న ఆలయంలోని ఫ్లైఓవర్‌ను తొలగిస్తున్న ఎక్స్‌కవేటర్

వేములవాడ కల్చరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామివారి ఆలయఅబివృద్ధి, విస్తరణపనులు ఊపందుకు న్నాయి. ప్రధాన ఆలయంలోని భక్తులు శ్రీస్వామి వారి దర్శనం కోసం వెళ్లేందుకు ఏర్పాటుచేసిన ఫ్లైఓవర్ క్యూలైన్‌లను సోమవారం తొలగించారు. ఉత్తరద్వారం వైపు నల్లాలసమీపంలో ప్రాకారం తొలగించడంతో ఎక్స్‌కవే టర్ ఆలయంలోకి ప్రవేశించింది. దీంతో క్యూలైన్‌లను మిషన్ సహాయంతో వేగంగా తొలగించారు.

సెల్ ఫోన్ అప్పగింత

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): సాంకేతిక పరిజ్ఞానం విని యోగించి పోగొట్టుకున్న సెల్‌ఫోనును కనుగొని ఎల్లారెడ్డిపేట మండలం దుమాల గ్రామానికి చెందిన బాధితుడు నిమ్మల నరేశ్‌కు సోమవారం అప్పగించామని ఎస్ఐ రాహుల్‌రెడ్డి పేర్కొన్నారు. నరేశ్ గ్రామం నుంచి ఎల్లారెడ్డిపేట వైపుకు వస్తున్న క్రమంలో సెల్‌ఫోన్ పోయిందని చెప్పారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో బ్లూకోర్టు కానిస్టేబుల్ సాయి విహార్, హోంగార్డు శంకర్ సెల్‌ఫోను లోకేషన్‌ను పసిగట్టి బాధితుడు నరే శ్‌కు అప్పగించామని పేర్కొన్నారు. సెల్‌ఫోనును గుర్తించడంలో కృషిచేసిన కానిస్టేబుల్ సాయివిహార్, హోంగార్డు శంకర్‌లను ఎస్ఐ రాహుల్‌రెడ్డి అభినందించారు.

అర్బన్ బ్యాంకు ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎన్నికల అధికారి, జగిత్యాల డీసీవో చెరుకు మనోజ్‌కుమార్

కరీంనగర్ టౌన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ సహకార అర్బన్ బ్యాంకు పాలకవర్గం ఎన్నికలకు అధికారయంత్రాంగం పకడ్బందీ ఏర్పాట్లు చేస్తోంది. కరీంనగర్ కేంద్ర శాఖ కలిగిన అర్బన్ బ్యాంక్‌కు జగిత్యాల, గంగాధరలో రెండు బ్రాంచ్‌లు ఉండగా, ఇటీవల గంగాధర బ్రాంచ్‌ను ప్రారంభించారు. ప్రస్తుత ఎన్నికల్లో కరీంనగర్, జగిత్యాల సభ్యులకే ఓటు హక్కు లభించింది. కరీంనగర్, జగిత్యాలలో కలిపి 9,282మంది ఓటర్లకు కరీంనగర్‌లో 7వేలు, జగిత్యాలలో 2వేల పైచిలుకు ఓటర్లు ఉన్నారు. ఈ మేరకు కరీంనగర్, జగిత్యాలలో పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. నవంబరు 1న నిర్వహించే పాలకవర్గ ఎన్నికల్లో కరీంనగర్ ఓటర్ల కోసం నగరంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో 24 పోలింగ్ కేంద్రాలు, జగిత్యాల సభ్యులు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు వీలుగా జగిత్యాల ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఏడు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. సోమవారం అర్బన్ బ్యాంకు పాలకవర్గ ఎన్నికల అధికారి, జగిత్యాల డీసీవో చెరుకు మనోజ్‌కుమార్ నగరంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలోని కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ నవంబరు 1న ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 2వరకు జరిగే పోలింగ్ కోసం అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ప్రశాంతంగా ఓటుహక్కు వినియోగించుకునే విధంగా ఓటర్ల కోసం క్యూలైన్లతోపాటు మంచినీటి వసతి, దివ్యాంగుల కోసం వీల్ చైర్లు అందుబాటులో ఉంచనున్నట్లు చెప్పారు. పోలింగ్ కేంద్రాల వద్ద బారీబందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అభ్యర్థులు, ఓటర్లు ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు సహకరించాలని కోరారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

వేములవాడ రూరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): హన్మాజిపేట గ్రామంలో పేకాట స్థావరంపై పోలీసులు దాడిచేశారు. గ్రామ శివారులో కొంతమంది వ్యక్తులు రహస్యంగా పేకాట ఆడుతున్నారన్న పక్కా సమాచారంతో ఎస్సై వెంకట్రాజం సిబ్బందితో వెళ్లి పేకాట ఆడుతున్న నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.40వేల210 నగదుతోపాటు పేకముక్కలను స్వాధీనం చేసుకున్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ఎస్సై వెంకట్రాజం హెచ్చరించారు.

- కొత్తపల్లి-మనోహరాబాద్ రైల్వే లైన్‌లో భూములు కోల్పోతున్న గంగాధర మండల రైతులు
- మార్కెట్ విలువ మేరకు పరిహారం అందించాలని నిర్వాసితుల డిమాండ్
- ఇప్పటికి ఆరు గ్రామ సభలు
- ఎటూ తేల్చని అధికారులు



పరిహారం అందేనా?

గంగాధర, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఆ గ్రామాల రైతులు నాలుగు ప్రాజెక్టులకు తమ జీవనాధారమైన భూములను ఇచ్చారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన పరిహారం అందకపోవడంతో ఎనిమిదేళ్లుగా ఎదురుచూస్తున్నారు. గంగాధర మండలంలోని పలు గ్రామాల మీదుగా కొత్తపల్లి, మనోహరబాద్ రైల్వేలైన్ నిర్మాణానికి 2004లో ప్రతిపాదనలు పంపించారు. కురిక్యాల, రంగరావుపల్లి, తాడిజెర్రి, ఉప్పరమల్యాల, గర్షకుర్తి, కాసారం గ్రామాల్లో భూమిని సేకరించారు. మూడేళ్ల క్రితమే ఈ ప్రాజెక్టులో భూములు కోల్పోయిన ఇతర



అధికారులు ఏర్పాటు చేసిన హద్దురాయి

గ్రామాల రైతులకు పరిహారం అందించారు. గంగాధర మండలం రంగరావుపల్లి, తాడిజెర్రి, ఉప్పర మల్యాల, గర్షకుర్తి, కాసారం గ్రామాల రైతులకు పరిహారం అందలేదు. భూమిలిచ్చి ఎనిమిదేళ్ల గడిచినా రైతులు పరిహారం కోసం ఎదురు చూస్తూనే ఉన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమకు పరిహారం అందించాలని వేడుకున్నా కనీస స్పందన కరువైంది. అధికారులు వచ్చి గ్రామంలో సభలు పెట్టి వెళ్లిపోతున్నారు. కాని పరిహారం విషయం తేల్చడం లేదు. నాలుగేళ్లుగా ఆరు గ్రామ సభలు నిర్వహించారు. ఇప్పటికీ పరిహారం అందించలేదు.

● నాలుగు ప్రాజెక్టులకు భూములు

మండలంలోని రంగరావుపల్లి, తాడిజెర్రి గ్రామాల రైతులు తమ విలువైన భూములను నాలుగు ప్రాజెక్టులకు అప్పగించారు. వరద కాలువ, డి4 డిస్ట్రిబ్యూటరీ కెనాల్, 1.1 టీఎంసీ కాలువ, కొత్తపల్లి మనోహరబాద్ రైల్వే లైనుకు భూములిచ్చారు. నాలుగు గ్రామాల్లో 50.19 ఎకరాల వ్యవసాయ భూములు, రంగరావుపల్లిలో 23, కాసారంలో 5 ఇళ్లు రైల్వే లైనులో పోతున్నాయి. భూములు కోల్పోతున్న రైతులు తమకు పరిహారం వస్తుందని ఇతర ప్రాంతాల్లో భూములు కొనేందుకు అడ్వాన్స్ ఇచ్చారు. మరి కొందరు అప్పులు తెచ్చి వేరే ప్రాంతాల్లో ఇళ్లు కట్టుకున్నారు. ఏళ్ల గడుస్తున్నా పరిహారం అందకపోవడంతో తమపై అప్పుల భారం పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు తమకు ప్రస్తుత మార్కెట్ విలువ ప్రకారం పరిహారం చెల్లించాలని నిర్వాసితులు కోరుతున్నారు.

జీవనాధారమైన భూమి పోతుంది

\- ద్యావ లింగారెడ్డి, రైతు, రంగరావుపల్లి



కొత్తపల్లి-మనోహరాబాద్ రైల్వే లైను నిర్మాణంలో ఐదు ఎకరాల భభూమి పోతుంది. ఆ భూమే నా కుటుంబానికి జీవనాధారం. రెండు కరెంటు బావుల్లో ఒకటి పోతుంది. ఉన్నదాంట్లో భూమి, బావి మధ్య నుంచి లైను పోతుంది. రైల్వే లైను వేస్తే పైపు లైన్ వెయ్యరాదు. ఉన్న బావి నీరు వారుకోవడానికి వీలు ఉండదు. ఈ బావికి కూడా పరిహారం అందిస్తే మరో బాయి తవ్వించుకుంటా. అధికారులు రైతులను బాధపెట్టవద్దు.

నాలుగు ప్రాజెక్టులకు భూమి ఇచ్చా

\- సందవేని అయిలయ్య, రైతు, రంగరావుపల్లి



గ్రామంలో చేపట్టిన నాలుగు ప్రాజెక్టులకు నా భూమి ఇచ్చా. వరద కాలువ, డి4, 1.1 టీఎంసీ, రైల్వే లైనులో ఐదు ఎకరాల పైచిలుకు వ్యవసాయ భూమి, ఎనిమిది గుంటల ఇంటి స్థలం, ఇల్లు పోయింది. సర్కారు ఇచ్చే పరిహారం కోసం ఎదురు చూస్తున్నా. డబ్బులు ఇస్తే వేరే ప్రాంతంలో భూమి తీసుకని ఇల్లు కట్టుకుందామనుకుంటున్న. పరిహారం ఎప్పుడిస్తరో చెప్పడం లేదు.

త్వరగా నష్టపరిహారం చెల్లించాలి

\- ద్యావ మధుసూదన్‌రెడ్డి, రంగరావుపల్లి



గ్రామంలో రైల్వే లైనుతో రైతులు పూర్తిగా నష్టపోతున్నారు. నా ఇల్లు కోల్పోతున్నాను. అధికారులు త్వరగా నష్టపరిహారం అందించాలి.

స్వదేశం చేరుకున్న గల్ఫ్ బాధితుడు



ఎయిర్‌పోర్టులో గౌరయ్యను కలిసిన బీఆర్ఎస్ నాయకులు

తంగళ్లపల్లి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఉపాధి కోసం గల్ఫ్ వెళ్లి ఏజెంట్ చేతిలో మోసపోయి రెండు నెలలుగా ఇబ్బందులు పడ్డ తంగళ్లపల్లి మండలం బస్వాపూర్ గ్రామానికి చెందిన బాలసాని గౌరయ్య సోమవారం స్వదేశానికి చేరుకున్నాడు. హైదరాబాద్‌లోని శంషాబాద్ ఎయిర్ పోర్టులో కటుంబసభ్యులు, బీఆర్ఎస్ నాయకులు గౌరయ్యకు స్వాగతం పలికారు. కుటుంబ సభ్యులను చూడగానే గౌరయ్య భావోద్వేగానికి గురయ్యాడు. తను రెండు నెలలుగా తీవ్ర ఇబ్బందులు పడ్డ విషయాన్ని ప్రస్తావిస్తూ తను స్వదేశానికి రావడానికి కృషి చేసిన కేటీఆర్‌తో పాటు స్థానిక బీఆర్ఎస్ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. బీఆర్ఎస్ నాయకులు వాహనం ఏర్పాటు చేసి గౌరయ్యను బస్వాపూర్‌లో తన ఇంటికి చేర్చారు.

దుర్శేడ్ పాఠశాలలో చోరీ

కరీంనగర్ రూరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ శివారులోని దుర్శేడ్ ప్రాథమిక పాఠశాలలో ఆదివారం రాత్రి దొంగలు ఆటవస్తువులు చోరీకి ఎత్తుకెళ్లారు. 5వ తరగతి గదిలో ఉన్న బీరువా పగలగొట్టి పిల్లలకు సంబంధించిన పుస్తలాలను చిందర వందర చేశారు. కొన్ని ఆటవస్తువులను దొంగిలించుకు పోయారు. పాఠశాల ప్రాంగణంలో నూనె పారబోశారు. పరిశీలించిన ఎంఈవో రవీందర్, ప్రధానోపాధ్యాయిని రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

రాష్ట్రస్థాయి సైక్లింగ్ పోటీల్లో రాణిస్తున్న సాహిత్య

● ఖేలో ఇండియా మహిళల విభాగంలో గోల్డ్‌మెడల్ ● జాతీయ స్థాయి పోటీల కోసం ప్రత్యేక శిక్షణ

మంథనిరూరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుంజపడుగు గ్రామానికి చెందిన ఉదరి సాహిత్య జిల్లా, రాష్ట్రస్థాయి సైక్లింగ్ పోటీలలో రాణిస్తోంది. ఇటీవల నిర్వహించిన ఖేలోఇండియా అండర్-14 సైక్లింగ్ విభాగంలో గోల్డ్‌మెడల్ సాధించి పలు విభాగాలలో ఛాంపియన్‌గా నిలిచింది. వచ్చేనెలలో జరిగే జాతీయస్థాయి పోటీలకు సిద్ధమవుతుంది. గుంజపడుగుకు చెందిన ఉదరి శ్రీనివాస్, సంధ్య దంపతుల చిన్నకూతురు సాహిత్య 5వ తరగతి చదువుతోంది. శ్రీనివాస్ దంపతులు కొన్నేళ్ళుగా హైదరాబాద్‌లో ఉంటున్నారు. తండ్రితో కలిసి ఉదయం గ్రౌండ్‌కు వాకింగ్ వెళ్లగా అక్కడ కొందరు చిన్నారులు సైక్లింగ్ శిక్షణ తీసుకుంటున్నారు. సైక్లింగ్‌పై సాహిత్య ఆసక్తి చూపడంతో శిక్షణ ప్రారంభమైంది. అంతర్జాతీయ సైక్లింగ్ క్రీడాకారుడు హైదరాబాద్‌కు చెందిన కోచ్ డాక్టర్ మాక్స్వెల్ ట్రెవోర్ శిక్షణ ఇస్తున్నాడు. అతని శిక్షణలో సాహిత్య వివిధ విభాగాలలో స్కూల్ గేమ్స్‌లలో మెడల్స్, సర్టిఫికెట్స్ సాధించింది. సీఎం కప్‌లో సిల్వర్ మెడల్, రాజీవ్ స్పోర్ట్స్ అకాడమి నిర్వహించిన పోటీలలో గోల్డ్ మెడల్ సాధించింది. నవంబరు 1, 2వ తేదీలలో ఒడిశాలో జరిగే జాతీయస్థాయి పోటీలకు సిద్ధమవుతుంది. సైక్లింగ్ శిక్షణకు ఒక్క సైకిల్ విలువ రెండు లక్షల వరకు ఉంటుందని, ప్రత్యేక గ్రౌండ్ అవసరం ఉంటుందన్నారు. సాహిత్యలో ఉన్న ప్రతిభను గుర్తించి కోచ్ ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్లు తండ్రి శ్రీనివాస్ తెలిపారు.



సాహిత్య



సాహిత్య సాధించిన మెడల్స్

ఉత్సాహంగా కొనసాగుతున్న క్రికెట్ పోటీలు



121 పరుగులు సాధించిన జయరాం కశ్యప్



క్రికెట్ మ్యాచ్ ఆడుతున్న బడ్డింగ్ స్టార్స్, కంబైన్డ్ డిస్ట్రిక్ట్ క్రీడాకారులు

కరీంనగర్ స్పోర్ట్స్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ సౌజన్యంతో కరీంనగర్ క్రికెట్ అసోసియేషన్ అల్గునూరు వెలిచాల జగపతి రావు మెమోరియల్ క్రికెట్ మైదానంలో నిర్వహిస్తున్న పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. సోమవారం నిర్వహించిన ఏ డివిజన్ వన్డేలీగ్‌కం నాకౌట్ క్రికెట్‌టోర్నీలో బడ్డింగ్ స్టార్స్ జట్టు కంబైన్డ్ డిస్ట్రిక్ట్ జట్టుపై 16పరుగులు తేడాతో గెలుపొందింది. ఈ మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన బడ్డింగ్ స్టార్స్ జట్టు నిర్ణీత 45ఓవర్లలో ఏడు వికెట్ల నష్టానికి 277పరుగులు చేసింది. ఈ జట్టు నుంచి జయరాం కశ్యప్ 121, అలంకృత్ అగర్వాల్ 52 పరుగులు తీశారు. కంబైన్డ్ డిస్ట్రిక్ట్ జట్టు నుంచి అఫ్రాజ్ గోరు 43 పరుగులు ఇచ్చి 4 వికెట్లు తీసుకున్నాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కంబైన్డ్ డిస్ట్రిక్ట్‌జట్టు నిర్ణీతఓవర్లలో 9వికెట్లు నష్టపోయి 261పరుగులు చేసి ఓటమి పాలైంది. జట్టునుంచి గణేష్ 74పరుగులు, డేవిడ్ కృపాల రాయి 43పరుగులు, జీఎస్‌కే రెడ్డి 50 పరుగులు సాధించారు. బడ్డింగ్ స్టార్స్‌జట్టు నుంచి ఉదయ్ కిరణ్ మూడు వికెట్లు తీసుకొని రాణించారు. ఈమ్యాచ్ నిర్వహణలో హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఎంపైర్స్‌తోపాటు జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షకార్యదర్శులు ఆగంరావు, మురళీధర్‌రావు, సభ్యులు మహేందర్‌గౌడ్, ఉపేందర్‌రావు, శ్రవణ్ కుమార్ పాల్గొన్నారు.

శంభో.. శంకరా..

● భీమన్న ఆలయానికి కార్తీక సోమవారం రద్దీ
● క్షేత్రస్థాయిలో ఏర్పాట్లు పరిశీలించిన ఈవో రమాదేవి



భక్తులతో కిక్కిరిసిపోయి కనిపిస్తున్న భీమేశ్వర ఆలయ ఆవరణ

వేములవాడ కల్చరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ శైవక్షేత్రంలో భక్తులు హర హర మహాదేవా.. శంభో శంకర.. నామ స్మరణతో భీమన్న ఆలయం మారుమోగింది. రాజన్న ఆలయ విస్తరణ, అభివృద్ధిలో భాగంగా పనులు జరుగుతుండటంతో భక్తులు భీమన్న ఆలయానికి సోమవారం పోటెత్తారు. కార్తీక సోమవారంను పురస్కరించుకుని ఇతర ప్రాంతాల నుంచి భారీగా తరలి వచ్చిన భక్తులతో ఆలయ ఆవరణ, ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. ముందుగా భక్తులు రాజన్న ఆలయ ధర్మగుండంలో పవిత్రస్నానాలు ఆచరించారు. నూతనంగా ఏర్పాటు చేసిన కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించుకున్నారు. నటరాజు విగ్రహం వద్ద భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన క్యూలైల వద్ద భక్తులు బారులు తీరారు. ఆయా క్యూలైన్‌ల ద్వారా ఆలయంలోకి చేరుకున్న భక్తులు భీమేశ్వర పాహిమాం అంటూ మొక్కలు చెల్లించుకుని వేడుకున్నారు. శ్రీస్వామి వారికి ఎంతో ప్రీతిపాత్రమైన కోడెమొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం భక్తులు అభిషేకాలు, గండ దీపంలో నూనె పోస్తూ గండాలు తొలగి పోవాలని వేడుకున్నారు. నూతనంగా నిర్మించిన షెడ్లలో చండీహోమం, సత్యనారాణ వ్రతాలు, లింగార్చనలు వంటి పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. కాగా అన్నదాన సత్రంపై అంతస్తులో ఏర్పాటుచేసిన నిత్యకళ్యాణానికి భక్తులు పెద్దసంఖ్యలో హాజరై మొక్కులు చెల్లించుకున్నారు. అంతే కాకుండా కార్తీక సోమవారం సందర్భంగా శ్రీస్వామి వారితోపాటుగా అనబంధ పరివార దేవతలకు ప్రత్యేక అర్చనలు, అభిషేకాలు, లింగార్చనలు ఆలయ అర్చకులు వైదికంగా చేపట్టారు.

భీమన్న ఆలయంలో ఏర్పాట్లు పరిశీలించిన ఈవో..

కార్తీకమాసం మొదటి సోమవారం సందర్భంగా రాజన్న, భీమన్న ఆలయాలకు భక్తుల పెద్దసంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా భీమన్న ఆలయానికి భక్తులు పోటెత్తారు. రాజన్న ఆలయ ఈవో రమాదేవి ఆలయంలో ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. భక్తులతో మాట్లాడారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని, భక్తులతో మర్యాదగా నడుచుకోవాలని ఉద్యోగులను ఈవో ఆదేశించారు.

భీమేశ్వర ఆలయంలో భక్తుల మొక్కులు..

వేములవాడ శ్రీభీమేశ్వర ఆలయంలో కార్తీక మాసం మొదటి సోమవారం సందర్భంగా భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. భీమన్న ఆలయంలో సోమవారం సాయంత్రం 6 గంటల వరకు 4వేల 21మంది కోడెమొక్కులు, 48అభిషేక పూజలు, 11అన్నపూజలు, 89 నిత్య కళ్యాణ పూజలు, 2చండీహోమం, 11 సత్యనారాయణ వ్రతాలు, 6కుంకుమపూజలు ఒక్కటి లింగార్చన, మూడు వాహనపూజలు, 21 పెద్దసేవల, పల్లకిసేవల టికెట్‌లు భక్తులు తీసుకున్నట్లు ఆలయాధికారులు వెల్లడించారు.

కోటిలింగాలలో గోదావరి హారతి

వెల్గటూర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): వెల్గటూర్ మండలంలోని కోటిలింగాలలో గోదావరి హారతి కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. అర్చకులు నాగరాజుశర్మ, సంజీవ్ శర్మలు శ్రీ పార్వతి కోటేశ్వర స్వామి ఆలయంలో స్వామి వారికి ప్రత్యేకపూజలు నిర్వహించిన అనంతరం గోదావరిమాతకు పూజలు చేసి గోదావరికి హారతినిచ్చారు. కార్తీక మాసంలో శ్రీ పార్వతీ కోటేశ్వర స్వామి ఆలయంలో నిత్య దీపోత్సవం, కార్తీక పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలతో పాటు ప్రతీసోమవారం గోదావరి హారతి కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయఈవో కాంతారెడ్డి, ఆలయ చైర్మన్ పూదరి రమేష్, ఆలయ అర్చకులు తెలిపారు. శ్రీ పార్వతీ కోటేశ్వర స్వామి ఆలయంలో భక్తులు ఆకట్టుకునేలా దీపాలంకరణ చేశారు.



కోటిలింగాల వద్ద గోదావరి హారతి ఇస్తున్న అర్చకులు



కొండగట్టులో దీపాలు వెలిగించిన భక్తులు

అంజన్న సన్నిధిలో కార్తీక దీపోత్సవం

మల్యాల: కార్తీకమాసం పురస్కరించుకొని కొండగట్టు అంజనేయస్వామి సన్నిధిలో సోమవారం కార్తీక దీపోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు, సిబ్బంది, భక్తులు ప్రత్యేకపూజలు నిర్వహించిన అనంతరం దీపాలు వెలిగించారు. ఆలయ ప్రధానార్చకులు రఘు, ఆలయ సిబ్బంది అశోక్, అర్చకులు, వేదపండితులు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీల్లో జడ్పీ హైస్కూల్ విద్యార్థుల ప్రతిభ

సుల్తానాబాద్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): క్రికెట్ పోటీల్లో సుల్తానాబాద్ జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి ఉమ్మడి జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఎస్‌జీఎఫ్ఐ ఆధ్వర్యంలో జెఎన్‌టీయూ కళాశాలలో నిర్వహించిన జిల్లాస్థాయి అండర్14,17 బాలబాలికల విభాగంలో జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు 17ఏళ్ల విభాగంలో వైష్ణవి, సాత్విక, అండర్ 14లో దిశాంత్‌లు ప్రతిభ చూపి, ఉమ్మడి జిల్లా స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికయ్యారు. విద్యార్థులను పాఠశాల హెచ్‌ఎం దివాకర్, ఫిజికల్ డైరెక్టర్ వెంకటేష్, ఉపాధ్యాయలు, తల్లితండ్రులు సోమవారం అభినందించారు.




క్రికెట్ పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం

ధర్మపురి క్షేత్రంలో కార్తీక సందడి

● భక్తుల రద్దీ
● ప్రత్యేక పూజలు



ఉసిరిక చెట్టు వద్ద దీపాలు వెలిగిస్తున్న మహిళలు



రామలింగేశ్వర స్వామి ఆలయంలో దీపోత్సవం

ధర్మపురి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో సోమవారం కార్తీక సందడి నెలకొంది. లక్ష్మీ నృసింహస్వామి, అనుబంధ శ్రీరామలింగేశ్వస్వామి, శ్రీ అక్కపెల్లి రాజరాజేశ్వర స్వామి ఆలయంలో భక్తుల రద్దీ పెరిగింది. అత్యంత భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. శివుడికి రుద్రాభిషేకం నిర్వహించగా భక్తులు బిల్వార్చన చేసి భక్తిశ్రద్ధలతో పూజించారు. మహిళలు దీపాలు వెలిగించి భక్తిని చాటుకున్నారు. స్వామి వారలకు ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్ శర్మ, వేద పారాయణదారు పాలెపు ప్రవీణ్‌కుమార్‌శర్మ తదితర వేద బ్రాహ్మణుల మంత్రోచ్ఛరణల మధ్య అభిషేకాది కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు ఆలయఈవో సంకటాల శ్రీనివాస్, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్ ఆధ్వర్యంలో అర్చకులు, సిబ్బంది సేవలు అందించారు.

● గోదావరి హారతి..

కార్తీకమాసం పురస్కరించుకొని ధర్మపురివద్ద సోమవారం గోదావరి హారతి ఘనంగా నిర్వహించారు. ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ మంత్రోచ్ఛరణల మధ్య అర్చకులు దేశం సుభిక్షంగా ఉండాలని, పంటలు సమృద్ధిగా పండాలని కోరుతూ విశేష పూజలు జరిపారు. మహిళలు దీపాలు వెలిగించి గోదావరి నదిలో వదిలి పుణ్యప్రాప్తి పొందారు.

● రామలింగేశ్వరుడికి రుద్రాభిషేకం

ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీ నరసింహ స్వామి అనుబంధశ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ఘనంగా రుద్రాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ, పాలెపు ప్రవీణ్‌కుమార్ నేతృత్వంలో రామలింగేశ్వర స్వామి వారలకు రుద్రాభిషేకం, ప్రత్యేక పూజలు, హారతి కార్యక్రమాన్ని నిర్వహించారు.

బోరు మోటారు ప్రారంభం

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు27(ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం బాకురుపల్లితండాలో బోరు మోటారును స్థానిక బీజేపీ నాయకులు సోమవారం ప్రారంభించారు. తాగు నీటి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేసిన ఎంపీ బండి సంజయ్‌కుమార్, నిధుల మంజూరుకు సహకరించిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు గోపి, ప్రధాన కార్యదర్శి తిరుపతిరెడ్డి, మండల అధ్యక్షుడు రామచంద్రారెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రమేశ్, గణేశ్, తిరుపతి, మురళీ, రాజునాయక్, చంద్రునాయక్, శంకర్, యశ్వంత్ పాల్గొన్నారు.

వారాల దేవయ్యకు నంది అవార్డు



అవార్డు అందుకుంటున్న దేవయ్య

వేములవాడ టౌన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): వేములవాడ పట్టణానికి చెందిన వారాల దేవయ్య నంది అవార్డు అందుకున్నట్లు ఆయన సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లో స్వాతి ఆర్ట్స్ క్రియేషన్స్ ఆధ్వర్యంలో సినిమా, దూరదర్శన్, యూట్యూబ్ కళాకారులకు అవార్డులను ప్రకటించారు. ఈ సందర్భంగా పట్టణానికి చెందిన వారాల దేవయ్య నటనకు బంగారు నంది అవార్డు వరించగా దర్శక నిర్మాత రేలంగి నరసింహారావు, సినీ దర్శకులు పసుపునూరి శ్రీనివాస్, ప్రొడ్యూసర్ రామ్ సత్యనారాయణ, అవార్డు అధినేత కేవై గిరిరాజు చేతుల మీదుగా అవార్డును ఆదివారం అందుకున్నారు.

కోనరావుపేట ఎంపీడీవోగా స్నిగ్ధ


బాధ్యతలు స్వీకరించిన స్నిగ్ధ

కోనరావుపేట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : కోనరావుపేట మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా స్నిగ్ధ సోమవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇంచార్జి ఎంపీడీవోగా ఉన్న గూడ శంకర్‌రెడ్డి నుంచి ఆమె బాధ్యతలు తీసుకున్నారు. ఎంపీడీఓగా విధుల్లోకి చేరిన స్నిగ్ధకు కార్యాలయ సిబ్బంది సాదర స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సిబ్బంది ఆమెకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఉద్యోగులు, ప్రజల సహకారంతో ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా అమలు చేయడమే తన లక్ష్యమని స్నిగ్ధ తెలిపారు.

వీర్నపల్లి ఎంపీడీవోగా శ్రీలేఖ

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), అక్టోబరు27(ఆంధ్రజ్యోతి): వీర్నపల్లి ఎంపీడీవోగా శ్రీలేఖ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇన్‌చార్జీ ఎంపీడీవోగా బీరయ్య విధులు నిర్వహించారు. అధికారులు, సిబ్బంది నూతన ఎంపీడీవో శ్రీలేఖను ఘనంగా సన్మానించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శ్రీలేఖ మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారుల సమన్వయంతో ముందుకు సాగి మండల అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను నేరుగా తన దృష్టికి తీసుకు వస్తే పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

భక్తితోనే ముక్తి

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు27(ఆంధ్రజ్యోతి): భక్తితోనే ముక్తి లభిస్తోందని బ్రహ్మశ్రీ మహేశ్వరశర్మ అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని సత్సంగ సదనం వార్షికోత్సవ వేడకల్లో భాగంగా సోమవారం ఆయన ప్రత్యేక పూజలను నిర్వహించారు. భక్తులనుద్దేశించి ప్రబోధనలు చేశారు. ఎల్లప్పుడు ధర్మం జయిస్తోందని అన్నారు. మానవులు భక్తిమార్గంలో పయనించాలని అన్నారు. అనంతరం భక్తుల భజనతో సత్సంగ సదనం ఆవరణ మార్మోగింది. కార్యక్రమంలో సత్సంగ సదనం అధ్యక్షుడు బ్రహ్మశ్రీ లక్ష్మారెడ్డి, కార్యదర్శి శ్రీనివాస్, పురోహితుడు దయానంద్‌శర్మ, సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

ముస్తాబాద్, అక్టోబర్ 27 (ఆంధ్రజ్యోతి) : ముస్తాబాద్ మండల కేంద్రంలోని షోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ బాలుర కళాశాల ఆవరణలో పోతుగల్ ప్రాథమికి వైద్యాధిరిణి డాక్టర్ ఆఫీజా ఆధ్వర్యంలో వైద్యపరీక్షలు నిర్వహించారు. . వైద్య శిబిరం నిర్వహించి విద్యార్థులందరికీ వైద్య పరీక్షలు, నిర్వహిస్తూ బరువు, జ్వరం, జలుబు, దగ్గు, కళ్ల పరీక్షలు నిర్వహించారు.కార్యక్రమంలో డాక్టర్ ఆఫీజా, ప్రిన్స్‌పాల్ ఉదయ్‌కుమార్‌రెడ్డి, సూపర్‌వైజర్ ప్రసాద్, ఎఎన్ఎం రేణుకతో పాటు పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

కోనరావుపేట: మండల కేంద్రంలోని కేజీబీవీ, ఆశ్రమ పాఠశాల హాస్టల్ విద్యార్థులకు మండల వైద్యాధికారి వేణుమాధవ్ వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత తదితర అంశాలపై అవగాహన కల్పించారు. పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ వైద్య పరీక్షల్లో వైద్య బృందం రషీద్, సరిత పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కామర్స్ వెబ్‌నార్

గంభీరావుపేట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) గంభీరావుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్‌డీఎల్ వారి ఆధ్వర్యంలో ఆన్‌లైన్ కామర్స్ వెబ్‌నార్ సోమవారం నిర్వహించారు. స్మార్ట్ ఇన్వెస్ట్‌మెంట్ అవేర్‌నెస్ ప్రోగ్రామ్‌ను ఆన్‌లైన్‌లో వివరించారు. సెబీ, డీమ్యాట్ ఎకౌంట్, సోషల్ మీడియాలో జరుగుతున్న మోసాలు, షేర్ మార్కెట్‌పై అవగాహన, ఇన్వెస్ట్‌మెంట్ తదితర అంశాలపై కళాశాల ప్రిన్సిపాల్ విజయలక్ష్మి వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ప్రభాకర్, విభాగ అధ్యాపకులు మనోహర్, మహేష్, జగన్నాథం తదితరులు విద్యార్థులు ఉన్నారు.

రైతులు పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

ఇల్లంతకుంట, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి) రైతులు పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పశువైద్యాధికారి రవీందర్‌రెడ్డి సూచించారు. మండల కేంద్రంలో సోమవారం జరిగిన గాలికుంటు వ్యాధి నివారణ టీకాల శిబిరాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో పశువైద్యాధికారులు పూర్ణచంద్రిక, ఇందిరలతో పాటు సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి

ఇల్లంతకుంట, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి) : తుఫాన్ ప్రభావం ఉండే అవకాశం ఉన్నందున రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తహసీల్దార్ ఫారూఖ్, వ్యవసాయాధికారి సురేష్‌రెడ్డిలు పేర్కొన్నారు. మూడు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ హెచ్చరించినందున రైతులు వరికోతలు చేయవద్దని, ధాన్యం తడవకుంగా చూడాలన్నారు.

నర్సక్కపేటలో బీహార్ కూలీల ఛత్‌పూజలు

ఇల్లంతకుంట, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి) : మండలంలోని నర్సక్కపేట గ్రామంలో బీహార్ కూలీలు ఛత్ పూజలు నిర్వహించారు. బీహార్ రాష్ట్రంలో సూర్యపూజ ప్రధానంగా ఛత్ పూజలు నిర్వహిస్తుంటారు. శ్రావణమాసంలో జరిగే ఈ పూజలో సోమవారం నర్సక్కపేట గ్రామం నుంచి పొత్తూరు గ్రామంలోని మానేరు వాగు వరకు కింద పడకుంటు వెళ్తూ పూజలు నిర్వహించారు. అనంతరం మానేరు వాగులో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

ధాన్యం ఆరబోసేందుకు స్థలం లేక ఇబ్బందులు

- అటవీ శాఖ స్థలాన్ని చదును చేసేందుకు రైతుల యత్నం
- అడ్డుకున్న అధికారులు

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), అక్టోబరు27(ఆంధ్రజ్యోతి): రేయింబవళ్లు శ్రమించి పండించిన పంటను ఖాళీ స్థలంలో పోసి అమ్ముకుందామంటే అటవీ శాఖ అధికారులు అడ్డుకుంటున్నారు. అటవీ శాఖ భూముల్లో ధాన్యం పోయనీయమని తేల్చి చెబుతున్నారు. స్థలం లేకపోతే ధాన్యం ఎక్కడ అమ్ముకోమంటారంటూ గిరిజనుల ఆగ్రహించారు. అటవీ స్థలాన్ని చదును చేసేందుకు యత్నించిన రైతులను అడ్డుకోవడంతో ఆక్రోషించారు. పక్కనే ఉన్న తమ భూముల్లోకి వస్తారనే భావనతో ఓ మహిళా రైతు పురుగుల మందు డబ్బా పట్టుకుని ఆత్మహత్యకు యత్నించిన సంఘటన వీర్నపల్లి మండలం మద్దిమల్లతండాలో సోమవారం చోటు చేసుకుంది. తండావాసుల కథనం మేరకు.. మద్దిమల్లతండా, లొద్దితండాల్లోని రైతులు పండించిన వరి ధాన్యాన్ని గ్రామంలోని ఖాళీ స్థలాల్లో పోసి విక్రయించేవారు. ఇటీవల మద్దిమల్లతండాలోని క్రీడా ప్రాంగణంలోని ధాన్యాన్ని తరలించడంతో స్థానిక యువకులు అడ్డుకున్నారు. సమాచారం అందుకున్న అధికారులు అక్కడకు చేరుకుని ధాన్యం పోయకూడదని పేర్కొన్నారు. అటు మద్దిమల్లతండా, ఇటు లొద్దితండాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రానికి స్థలాలు లేకపోవడం వల్ల స్థానిక స్మశాన వాటిక సమీపంలోని ఖాళీ స్థలా న్ని చదును చేసేందుకు రైతులు యత్నించారు. విషయం తెలుసుకున్న అధికారులు, పోలీసులు అక్కడకు చేరుకుని పనులు చేయవద్దని పేర్కొన్నారు. ఈ క్రమంలో స్మశాన వాటిక పక్కన ఉన్న తమ భూమిలోకి ఎక్కడ వస్తారోనని అందోళనకు గురైన మహిళా రైతు పురుగుల మందు డబ్బాతో ఆత్మహత్యకు యత్నించింది. తేరుకున్న అధికారులు, పోలీసులు ఆమె నుంచి పురుగుల మందు డబ్బాను లాక్కున్నారు. తాము పండించిన ధాన్యం అమ్ముకునేందుకు అవస్థలు పడుతున్నామని గిరిజన రైతులు వాపోయారు.

మద్యం షాపులకు లక్కీడ్రా

- 1,381 దరఖాస్తులు.. 48 మందిని వరించిన అదృష్టం
- ముగ్గురు మహిళలకు అవకాశం
- డిసెంబరు 1న నూతన వైన్స్ ప్రారంభం



లక్కీ డ్రా తీస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్ గరిమా అగర్వాల్


డ్రాకు హాజరైన మద్యం వ్యాపారులు

సిరిసిల్ల క్రైం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మద్యం దుకాణాల కేటాయింపులో 48 మంది మద్యం వ్యాపారులకు లక్కు తగిలింది. జిల్లాలోని 48వైన్స్‌లకు 1,381మంది దరఖాస్తులు దాఖలు చేశారు. ఒక్క వైన్స్‌కు దాదాపు 42 దరఖాస్తులు దాఖలు కావడంతో పోటీ పెరిగింది. మొత్తం 48మంది వ్యాపారులకు అదృష్టం వరిం చింది. మిగితా 1,333మంది నిరాశతో వెనుదిరిగి పోయారు. గ్రూపుల వారీగా వైన్స్‌లను మద్యం వ్యాపారులు దక్కించుకున్నారు. సోమవారం జిల్లా సమీకృత కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా ఇంచార్జి కలెక్టర్ గరిమా అగర్వాల్, ఇన్‌చార్జి సహాయ ఎక్సైజ్ సూపరింటెండెంట్ రాధాకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో 48వైన్స్‌లకు లక్కీ డ్రా తీశారు. ముందుగా సిరిసిల్ల ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని సిరిసిల్ల టౌన్-1షాప్‌నకు ఇంచార్జి కలెక్టర్ గరిమా అగర్వాల్ డ్రా తీసి ప్రారంభిం చారు. ఆ తర్వాత అన్ని షాప్‌లకు ఇంచార్జి కలెక్టర్ స్వయంగా డ్రా తీశారు. షాప్‌నెంబర్-1కు తీసిన డ్రాలో మల్లారెడ్డికి లభించింది. ఓ గ్రూపు 60 దరఖాస్తులు దాఖలు చేస్తే అనిల్ అనే గ్రూపునకు ఒకటే దక్కింది, మరో ఐదు గ్రూపు లకు కలిసి 147 దరఖాస్తులు దాఖలు చేయగా 5 వైన్స్‌లు దక్కాయి. మిగితా వైన్స్‌లు కొత్తవారికే వరిం చాయి. వైన్స్‌ల టెండర్‌లలో ఒకటి నుంచి 5 వరకు దరఖాస్తు చేసిన మద్య వ్యాపారులకు ఎవరికీ దక్కాలేదు. ఆ తర్వాత వరుస క్రమంలో సిరిసిల్ల, తంగళ్లపల్లి, ఇల్లంతకుంట, బోయిన్‌పల్లి, వేములవాడ, చందుర్తి, రుద్రంగి, ఎల్లారెడ్డిపేట, గంభీరావుపేట, ముస్తాబాద్, కోనరావుపేట, వీర్నపల్లి మండలాల్లోని వైన్స్‌లకు దరఖాస్తుదారుల హాజరు తీసుకొని సహాయ ఎక్సైజ్ సూపరింటెండెంట్ రాధాకృష్ణా రెడ్డి దరఖాస్తుదారుల నెంబర్‌ల వారీగా టోకెన్‌లను డబ్బాలో వేయగా ఇంచార్జి కలెక్టర్ గరిమా అగర్వాల్ స్వయంగా డ్రా తీయగా విజేతలను ప్రకటించారు. 48 వైన్స్‌లకు డ్రా తీయడానికి మూడు గంటలు పట్టింది. ఈ సారి 329 మంది మహిళలు దరఖాస్తు చేయగా ముగ్గురు మహిళలకు వైన్స్‌లు దక్కాయి. గత నెల 26నుంచి మొదలైన దరఖాస్తు ప్రక్రియ డ్రాతో కలిపి నెల రోజులకు వైన్స్‌ల టెండర్‌ల ప్రక్రియ ముగిసింది. వేలాది మంది మద్యం వ్యాపారులు వాహనాలలో కలెక్టరేట్‌కు చేరుకోవడంతో ట్రాఫిక్, పార్కింగ్‌కు ఇబ్బంది తలెత్తింది.

పారదర్శకంగా వైన్స్ లక్కీడ్రా

ఇన్‌చార్జి కలెక్టర్ గరిమా అగర్వాల్

మద్యం దుకాణాల టెండర్ లక్కీ డ్రా పారదర్శకంగా నిర్వహించినట్లు ఇన్‌చార్జి కలెక్టర్ గరీమా అగర్వాల్ అన్నారు. నూతన లైసెన్సుల మద్యం దుకాణాలు డిసెంబర్ 1నుంచి కొనసాగుతాయన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం దుకాణాలను ఏర్పాటు చేయాలన్నారు. మైనర్లకు మద్యం విక్రయించ వద్దన్నారు.

లైసెన్స్ ఫీజు రూ. 4.18కోట్లు

జిల్లాలో 48వైన్స్‌లు కైవసం చేసుకున్న మద్యం వ్యాపారులు లైసెన్స్ ఫీజులోని 6వ భాగం ఒక్కో వైన్స్‌కు చెల్లించడంతో రూ. 4.18కోట్ల ఆదాయం సమకూరింది. అంతకుముందు దరఖాస్తుల ఫీజు రూపంలో రూ.41.43 కోట్ల ఆదాయం లభించింది. వైన్స్‌లు దక్కిన వ్యాపారులకు ఈ నెల 31న ప్రొవిజనల్ లైసెన్స్‌లు జారీ చేస్తారు. డిసెంబరు 1నుంచి వైన్స్‌లలో నూతన విక్రయాలు ప్రారంభం అవుతాయి.

పర్యాటకంపై పట్టింపేది?

(5వ పేజీ తరువాయి)

ఆలయం ఉంది. పర్యాటకంగా అభివృద్ధి చేస్తే ఇక్కడికి వచ్చే పర్యాటకులు, యాత్రికులకు ప్రాజెక్ట్ ఎంతో ఆహ్లాదాన్ని పంచుతుందని భావిస్తున్నారు. జిల్లాలోని వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానానికి తెలంగాణలోని అన్ని జిల్లాలతో పాటు పొరుగున ఉన్న మహారాష్ట్ర నుంచి కూడా భక్తులు ప్రతి ఏటా లక్షల సంఖ్యలో వచ్చిపోతుంటారు. మిడ్ మానేరు, అనంతగిరి ప్రాజెక్ట్‌లను పర్యాటకంగా అభివృద్ధి చేస్తే ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని గత ప్రభుత్వం భావించింది. మిడ్‌మానేరు ప్రాజెక్ట్ వద్ద బోటింగ్‌తో పాటు అడ్వెంచర్ పార్కు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. కానీ పర్యాటక అభివృద్ధి ప్రతిపాదనలు ముందుకు సాగడం లేదు.

రుద్రంగి సాయిబాబా ఆలయ వార్షికోత్సవం

రుద్రంగి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి) రుద్రంగి మండల కేంద్రంలోని శ్రీదత్త సాయి బాబా ఆలయం ద్విదశ వార్షికోత్సవాల (జాతర)కు ముస్తాబవుతోంది. మంగళవారం ఉదయం నుంచి మంగళ వాయిద్యాలు కాగడ హారతి, పతాకారోహణ, గణపతి అర్చన, సాముహిక కుంకుమ పూజలులతో పాటు సాయంత్రం సంధ్యాహారతి, బుధవారం అభిషేకాలు, మహాఅన్నదానంతో పాటు స్వామి వారి డోలోత్సవం, విష్ణు సహస్రనామ పారాయణం కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

దత్తాత్రేయ స్వామి ఆలయానికి వంతెన నిర్మించాలి


మంత్రి ఉత్తమ్‌కు విన్నవిస్తున్న నాయకులు

బోయినపల్లి అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): శ్రీ దత్తాత్రేయ స్వామి ఆలయానికి వంతెన నిర్మించాలని ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డితో పాటు మంత్రి పొన్నం ప్రభాకర్‌ను జిల్లా కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ అధ్యక్షుడు కూస రవీందర్, ఆలయ కమిటీ సభ్యులు కలిసి వినతిపత్రం అందజేశారు. శ్రీ దత్తాత్రేయ స్వామి దర్శనానికి పర్యటకశాఖ బోటును నడిపేందుకు ఆపరేటర్లు నియామకం చేసింది. నేటి నుంచి బోట్ సేవలు అందుబాటులో ఉండాల్సింది. అయితే ఆలయ కమిటీ సభ్యులు భక్తులు బోట్ నుంచి వచ్చే ఆదాయంలో కొంత భాగం ఆలయానికి ఇవ్వాలని బోటు సేవలను నిలిపివేశారు. ఆలయాన్ని పర్యటకంగా తీర్చిదిద్దాలని మంత్రులకు విజ్ఞప్తి చేశారు.

యువతి అదృశ్యం

చందుర్తి అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): చందుర్తి మండలం రామన్నపేటకు చెందిన ఏరెడ్డి అక్షయ అనే యువతి అదృశ్యమైనట్లు ఎస్సై రమేష్ సోమవారం తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం యువతి ఈ నెల 24న కళాశాలకు వెళ్తున్నానని చెప్పి ఇంట్లో నుంచి వెళ్లింది. ఇంటికి తిరిగి రాకపోవడంతో ఫోన్ చేస్తే ఫోన్ స్విచాఫ్ వచ్చింది. తల్లిదండ్రులు బంధువులకు ఫోన్ చేసినప్పటికీ అక్షయ ఆచూకీ లభ్యం కాలేదు. తన కూతురు అదృశ్యమైనట్లు తండ్రి శ్రీనివాసరెడ్డి ఇచ్చిన ఫిర్యా దు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జె. రమేష్ తెలిపారు.

పోలీసు అమరుల త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలి


సిరిసిల్లలో సైకిల్ ర్యాలీ


ఎల్లారెడ్డిపేటలో పోలీసుల సైకిల్ ర్యాలీ


సైకిల్ ర్యాలీలో వేములవాడ రూరల్ సీఐ

సిరిసిల్ల క్రైం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని అదనపు ఎస్పీ చంద్రయ్య అన్నారు. జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలలో భాగంగా సోమవారం సాయంత్రం సిరిసిల్ల పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా నుంచి బతుకమ్మ ఘాట్ వరకు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో శాంతి భద్రతల స్థాపనకు పోలీసులు చేస్తున్న కృషి గురించి ప్రజలకు అవగాహన కల్పించడానికి ఇటువంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడుతాయన్నారు. కార్యక్రమంలో ఇన్స్‌పెక్టర్లు కృష్ణ, మొగిలి, శ్రీనివాస్, వీరప్రసాద్, వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు, మధుకర్, ఆర్.ఐలు మధుకర్, రమేష్ ,యాదగిరి,ఎస్.ఐలు, ఆర్ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది, విద్యార్థులున్నారు.

ఎల్లారెడ్డిపేట/వీర్నపల్లి : పోలీసు అమరుల త్యాగాలు మరవలేనివని ఎల్లారెడ్డిపేట రూరల్ సీఐ శ్రీనివాస్ అన్నారు. పోలీసు అమర వీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి మండల కేంద్రాల్లో పోలీసు శాఖ ఆధ్వర్యంలో సైకిల్ ర్యాలీ, విద్యార్థులకు ఓపెన్ హౌస్ నిర్వహించారు. కార్యాక్రమంలో సీఐ శ్రీనివాస్, ఎస్ఐలు రాహుల్‌రెడ్డి, లక్ష్మణ్, సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు, యువకులు పాల్గొన్నారు. ఎల్లారెడ్డిపేట పోలీస్‌స్టేషన్‌లో విద్యార్థులకు ఓపెన్ హౌస్‌లో ఆయుధాల పనితీరు, విధులు, కేసుల వివరాలపై అవగాహన కల్పించారు.

వేములవాడ రూరల్ : ప్రజారక్షణ, శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా విధినిర్వహణలో అసువులు బాసిన పోలీసు అమరుల త్యాగాలు మరువలేనివని వేములవాడ రూరల్ సీఐ శ్రీనివాస్ అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవ కార్యక్రమంలో భాగంగా హన్మాజిపేట గ్రామంలో సోమవారం రూరల్ ఎస్సై వెంకట్రాజం ఆధ్వర్యంలో సైకిల్ ర్యాలీలో విద్యార్థులతో ఆయన పాల్గొన్నారు.

చందుర్తి: పోలీసుల త్యాగాలు మరువలేనివని చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు అన్నారు. చందుర్తి మండల కేంద్రంలో పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా సోమవారం పోలీసులు పలు వీధుల్లో విద్యార్థులతో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్సై రమేష్, ఎఎస్సై, పోలీస్ సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.


చందుర్తిలో సైకిల్ ర్యాలీ

గంభీరావుపేట : మండల కేంద్రంలో పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో బాగంగా సోమవారం పోలీస్‌లు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ప్రధాన రహదారి వెంట పోలీస్‌లు, ఆక్స్‌ఫర్డ్ స్కూల్ విద్యార్థులు సైకిళ్లపై ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ అనిల్‌కుమార్, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు ఉన్నారు.

ముస్తాబాద్: పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాల సందర్భంగా ముస్తాబాద్ మండల కేంద్రంలో ఎస్సై సీహెచ్ గణేశ్ ఆధ్వర్యంలో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. పీసీలు కుమార్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి, గజ్జెల రాజు, గుండెల్లి శ్రీనివాస్, రంజాని నరేశ్, మిరుదొడ్డి భాను, తాళ్ల విజయ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రుద్రంగి : పోలీస్ ఆమరవీరుల సంస్కరణ వారోత్సవాల్లో భాగంగా రుద్రంగి మండల కేంద్రంలో ఎస్ఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీసులు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ శ్రీనివాస్ మాట్లాడుతూ పోలీస్ అమరవీరుల త్యాగాలు వెలకట్టలేనివని అన్నారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ ప్రభాకర్, రవి, సంతు, శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.

రాజన్న ఆలయ అభివృద్ధి పనులు పరిశీలించిన ఇన్‌చార్జి కలెక్టర్

వేములవాడ టౌన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి ఆలయంలో చేపడుతున్న అభివృద్ధి, విస్తరణ పనులను జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ గరీమా అగర్వాల్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రాజన్న ఆలయానికి సోమవారం వచ్చిన కలెక్టర్ ఆలయ విస్తరణలో భాగంగా ప్రణాళిక ప్రకారం ఇప్పటి వరకు చేపట్టిన కూల్చివేత పనులను, ఆలయ, ఆర్అండ్‌బీ అధికారులు కలెక్టర్‌కు క్లుప్తంగా వివరించారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రచార రథం, ఆలయం ముందు రహదారి విస్తరణ, తదితర అభివృద్ధి పనులను పరిశీలించి, పనుల పురోగతిని సంబంధిత శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బద్ది పోచమ్మ ఆలయ విస్తరణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రగతిలో ఉన్న పనుల వివరాలను, కల్పించబోయే సౌకర్యాల గురించి సంబంధిత అధికారులు ఇంచార్జి కలెక్టర్‌కు వివరించారు. వారి వెంట ఈవో రమాదేవి, ఆర్డీవో రాధాబాయి, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ నిఖిత, ఆర్అండ్‌బీ ఈఈ నరసింహచారి, వీటీడీఏ సీపీవో అన్సారీ, అధికారులు కిషోర్, అన్వేష్ తదితరులు ఉన్నారు.


మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్


ఆలయంలో పరిశీలిస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్

గుడి చెరువు బండ్ సందర్శన

రాజన్న ఆలయ అభివృద్ధిలో భాగంగా వీటీడీఏ ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి పనుల్లో గుడి చెరువు బండ్‌ను ఇంచార్జి కలెక్టర్ సోమవారం సందర్శించారు. సంబంధిత అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో తిరగుతూ బండ్ నిర్మాణ పనులు ఎప్పుడు ప్రారంభించారని అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి వరకు జరిగిన పనులను పరిశీలించి, మిగిలిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. వారి వెంట పర్యాటక సంస్థ ఎస్ఈ సరిత, వీటీడీఏ సీపీవో అన్సారీ, మున్సిపల్ కమిషనర్ అన్వేష్ తదితరులు ఉన్నారు.

గుప్త నిధుల తవ్వకాల కలకలం

వేములవాడ క్రైం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): గుప్తనిధుల తవ్వకాల కేసులో వేములవాడకు చెందిన వ్యక్తులు అరెస్టు కావడం జిల్లాలో కలకలం రేపింది. వరంగల్ జిల్లాలోని ముల్కనూరు ప్రాంతంలో గుప్తనిధుల కోసం అన్వేషణ చేసిన ఓ మూఠా పోలీసులకు చిక్కింది. ముల్కనూరు శివారులో గుప్తనిధుల కోసం తవ్వకాలు చేపట్టిన ఏడుగురు మూఠాలోని వేములవాడకు చెందిన ఎన్. శంకర్, ఎం. రవి, ఎ. శరత్‌రెడ్డిలతో పాటు ముల్కనూరుకు చెందిన కె. శివాజీ, కరీంనగర్ పట్టణంలోని రేకుర్తికి చెందిన అశోక్, మంకమ్మతోటకు చెందిన పి.రాజు, ఎం. నాగరాజులను ఈ నెల 25న పోలీసులు అరెస్ట్‌చేశారు. ఈ మూఠాలో మరొకరు పరారీలో ఉన్నాడు. ఇందులో వేములవాడ పట్టణానికి చెందిన ముగ్గురు వ్యక్తులు ఉండడంతో కలకలం సృష్టిస్తోంది. సూత్రదారులు, పాత్రదారులు ఎవరనేది పోలీసులు పోలీసులు ఆరా తీస్తున్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

వేములవాడ టౌన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): దళారులకు ధాన్యం విక్రయించి రైతులు మోస పోవద్దని మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు అన్నారు. వేములవాడ మండలం మారుపాక గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కనికరపు రాకేష్, డైరేక్టర్ కత్తి కనుకయ్య నాయకులు పిల్లి కనుకయ్య, ముడికే చంద్రశేఖర్ యాదవ్ ఉన్నారు.

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట): మండల కేంద్రంతో పాటు కంచర్ల, భూక్యతండా, బాపుసింగ్‌నాయక్‌తండా, బాబాయిచెరువుతండా, బంజరుతండా, మద్దిమల్ల గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సెస్ డైరెక్టర్ మల్లేశం, ఎస్ఐ లక్ష్మణ్, స్థానిక నాయకులతో ఏఎంసీ చైర్మన్ రాములు నాయక్ ప్రారంభించారు.

చందుర్తి: మండలంలో ఐకెపి ఆధ్వర్యంలో ఎన్గల్, మర్రిగడ్డ, జోగాపూర్, కిష్టంపేట సింగిల్ విండో ఆధ్వర్యంలో బండపల్లి, రామరావుపల్లి గ్రామాలలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను స్థానిక నాయకులతో రుద్రంగి మార్కెట్ కమిటీ చైర్మన్ చెలుకల తిరుపతి ప్రారంభించారు.

బోయినపల్లి : మండలంలోని వివిధ గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను బోయినపల్లి ఏఎంసి చైర్మన్ బోయిని ఎల్లేష్ యాదవ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నారాయణ రెడ్డి ఎంపీడీవో జయశీల ఏపీఎం జయసుధ పాల్గొన్నారు.

కోనరావుపేట : మండలంలోని మామిడిపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కోనరావుపేట సింగిల్ విండో చైర్మన్ బండ నర్సయ్య ప్రారంభించి మాట్లాడారు. దళారులకు అమ్మకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించాలని అన్నారు. మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తాళ్లపెల్లి ప్రభాకర్, సింగిల్ విండో వైస్ చైర్మన్ అనుపాటి భూంరెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ సాసాల మల్లారెడ్డి, రైతులు పాల్గొన్నారు.


మారుపాకలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న రాజు


బోయిన్‌పల్లి మండలంలో..



రుద్రంగి మండలంలోని వీరునితండాలో..

రుద్రంగి : రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం అని మార్కెట్ కమిటీ చైర్మన్ చెలుకల తిరుపతి అన్నారు. రుద్రంగి మండలంలోని వీరుని తండా గ్రామంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, తెలంగాణ కోఆపరేటివ్ యూనియన్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో సూర యాదయ్య, రైతులు పాల్గొన్నారు.